Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 300 మేడ్చల్ మల్కాజ్‌గిరి 18 నవంబర్ 2023 శనివారం పేజీలు : 4

## ఘాటెక్కిన ఉల్లి.. కిలో ఎంతంటే...

చెన్నై : కోయంబేడు మార్కెట్‌లో ఉల్లి ధర పేద, మధ్యతరగతి ప్రజలకు అందలేనంతగా పెరుగుతోంది. ఆ మార్కెట్‌లో కేజీ పెద్ద ఉల్లి రూ. 75లకు విక్రయించారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఉల్లి పంట కోత జాప్యం కావటంతో ఆ రాష్టం నుంచి అవసరమైనంత ఉల్లి కోయంబేడు మార్కెట్‌కు దిగుమతి కావటం లేదని, ఆ కారణంగా ఉల్లి ధర రూ.75లకు పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కోయంబేడు మార్కెట్‌లో కేజీ ఉల్లిపాయలు రూ.75లకు విక్రయిస్తుండగా, చిల్లర వ్యాపారులు రూ.90లకు అమ్ముతుండటంతో నగరవాసులు ఇబ్బందు లకు గురవుతున్నారు. వారానికి ఐదు కేజీల చొప్పున కొనేవారంతా ప్రస్తుతం పావు, అర కేజీ చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇదే విధంగా సాంబారు (చిన్న) ఉల్లి ధర కూడా గత కొద్ది రోజులుగా పెరుగుతోంది. కోయంబేడు మార్కెట్‌లో కేజీ చిన్న ఉల్లిపాయలు రూ.90లకు విక్రయిస్తుండగా, చిల్లర మార్కెట్లలో రూ.120లకు విక్రయిస్తున్నారు.



# కాంగ్రెస్ దోకాబాజ్ పార్టీ


## 58 ఏండ్లు తెలంగాణను ఏడిపించుకుతింది


### కరీంనగర్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ దోకాబాజ్ పార్టీ అని, ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఇక్కడి ప్రజలను 58 ఏండ్లు ఏడిపించిన పార్టీ అని ముఖ్యమంత్రి కేసీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమం మొదలైనప్పటి నుంచి ఎన్నో విజయాలకు కరీంనగర్ గడ్డ కేంద్ర బిందువుగా ఉన్నదని సీఎం గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఉద్యమానికి, ప్రజలకు, వ్యక్తిగతంగా తనకు ఎన్నో విజయాలను అందించిన కరీంనగర్ గడ్డకు తాను శిరసు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు. 'ఈ సభ జరుగుతున్న ఎస్ఆర్ఆర్ కాలేజీ గ్రౌండ్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. తెలంగాణ ఉద్యమ చరిత్రలో 2011, మే 17న మొట్టమొదటి సింహగర్జణ సభ ఈ కాలేజీ వేదికగానే జరిగింది. తెలంగాణ రాష్ట్రం తీసుకరాకపోయినా, ఉద్యమాన్ని విరమించినా నన్ను రాళ్లతో కొట్టి చంపండి అని నాడు జరిగిన సభలో నేను చెప్పిన. ఆ సభకు ఎవరూ ఊహించనంత మంది వచ్చి జయప్రదం చేశారు. గంగుల కమాలకర్ చెప్పినట్లు దళితబంధు, రైతుబంధు, రైతు బీమా లాంటి అనేక మంచి కార్యక్రమాలను కరీంనగర్ వేదిక నుంచే ప్రారంభించుకున్నాం. తెలంగాణ ఉద్యమానికి, తెలంగాణ ప్రజలకు, వ్యక్తిగతంగా నాకు అనేక విజయాలను అందించిన ఈ కరీంనగర్ మట్టి నేను శిరసు వంచి నమస్కరిస్తున్నా' అని చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ దోకాబాజ్ పార్టీ. ఉన్న తెలంగాణను ఊడగొట్టి మనలను 58 ఏళ్లు ఏడిపించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ. 1969లో ఉద్యమం చేస్తే 400 మందిని కాల్చిచంపిన పార్టీ. 2004లో మనతో పొత్తుపెట్టుకుని రాష్టంల, కేంద్రంల అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఆర్నెళ్లకో, ఏడాదికో తెలంగాణ ఇవ్వకుండా కాంగ్రెస్ నేతలు దోకా చేశారు. 13, 14 ఏండ్లు కొట్లాడితే తెలంగాణ ఇచ్చేందుకు ముందుకొచ్చారు. తర్వాత మళ్లీ వెనుకకు పోయారు. అంతేగాక టీఆర్ఎస్ పార్టీని చీల్చే ప్రయత్నం చేశారు. దాంతో కేసీఆర్ శవయాత్రనో, తెలంగాణ జైత్రయాత్రనో ఏదో ఒకటి జరగాలని నేను ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన. ఆ దీక్ష కూడా ఈ కరీంనగర్ గడ్డనే వేదికైంది. నన్ను అలుగునూ చౌరస్తాలో అరెస్టు చేసి ఖమ్మం జైల్లో పెట్టారు. ఇలాంటి అనేక ఉద్యమ ఘట్టాల్లో ప్రథమ స్థానంలో ఉండేది కరీంనగర్ మట్టి, కరీంనగర్ గడ్డ' అని సీఎం కరీంనగర్ నేలపై తనకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు. 'ఇక్కడి నుంచే ఉద్యమం మొదలైంది కాబట్టి ఇక్కడ నేను రెండు విషయాలు చెప్పదల్చుకున్నా. ఒక దేశమైనా, రాష్ట్రమైనా బాగుందా.. లేదా..? అని చూసేందుకు రెండు కొలమానాలు ఉంటాయి. అందులో ప్రధానమైనది తలసరి ఆదాయం. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు తలసరి ఆదాయంలో దేశంలో మన ర్యాంకు పంతొమ్మిదో, ఇరవైయ్యో ఉండె. పదేళ్ల బీఆర్ఎస్ పాలన తర్వాత నా తెలంగాణ 3.18 వేల తలసరి ఆదాయంతోటి దేశంలోనే నెంబర్ 1గా ఉన్నది. కడుపు నోరు కట్టుకుని, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నం కాబట్టి ఇయ్యాల ఈ స్థాయికి వచ్చినం. రెండో గీటురాయి తలసరి విద్యుత్ వినియోగం. 2014లో తలసరి విద్యుత్ వినియోగం 1,122 యూనిట్లు ఉండె. దేశంలో మన ర్యాంకు ఎక్కడో ఉండె. ఇప్పుడు 2,040 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగంతోటి దేశంలో మనమే నెంబర్ 1గా ఉన్నాం' అన్నారు.

**24 గంటల పాటు నల్లా నీళ్లు ఉండే స్కీం తెస్తున్నాం..** : రాబోయే కొద్ది రోజుల్లో తెలంగాణలో 24 గంటల పాటు నల్లా నీళ్లు ఉండే స్కీం ఏర్పాటు చేస్తున్నాం.. ఎప్పుడు తిప్పుకుంటే అప్పుడే నీళ్లు వచ్చేటట్టు, ఆ దిశగా పనులు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని గంగుల కమలాకర్‌కు మద్దతుగా ప్రసంగించారు. గంగుల కమలాకర్ నేతృత్వంలో కరీంనగర్ పట్టణం ఎంతో సుందరంగా తయారైంది. కరీంనగర్ పట్టణం అని కాకుండా, కరీంనగర్ నరగం అని పిలవాలనిపిస్తోంది. గంగుల కమలాకర్ మొండి మనిషి, పట్టిన పట్టు విడవడు కాబట్టి వెంటపడి ఆ మానేరు రివర్ పంట్ర్ కట్టిస్తున్నాడు. కరీంనగర్‌లో చౌరస్తాలు, రోడ్లు, సందులు అద్భుతంగా తయారయ్యాయి. అద్దంలో చూపించిన స్పష్టమైన తేడా కనబడుతుంది. ప్రజల యెడల అభిమానం ఉండి, పని చేసే ప్రభుత్వం ఉంటే, అభివృద్ధి ఎలా ఉంటుందో దానికి కరీంనగర్ అభివృద్ధి నిదర్శనం అని కేసీఆర్ పేర్కొన్నారు. ఒకసారి మానేరు రివర్ ఫ్రంట్ పూర్తయితే కరీంనగర్ పట్టణం పర్యాటక ప్రాంతంగా మారే అవకాశం ఉంటుంది. ఇప్పటికే సందర్శకులు వస్తున్నారు రూ. 410 కోట్లతో ముమ్మురంగా పనులు జరుగుతున్నాయి. మానేరు మునుపు ఎలా ఉండేనో ఆలోచించాలి. నెత్తి మీద డ్యాం ఉన్న కరీంనగర్‌కు నీళ్లు రాని పరిస్థితి. ఇవాళ ప్రతి రోజులు నీళ్లు వస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో తెలంగాణలో 24 గంటల పాటు నల్లా నీళ్లు ఉండే స్కీం ఏర్పాటు చేస్తున్నాం. ఎప్పుడు తిప్పుకుంటే అప్పుడే వచ్చేటట్టు ఆ దిశగా పనులు జరుగుతున్నాయి. ఒక రూపాయికి నల్లా కనెక్షన్ ఎవడైనా ఇచ్చిండా..? ఇవాళ ఒకటే రూపాయికి నల్లా కనెక్షన్ ఇవ్వడంతో, మహిళలు బిందెలు పట్టుకుని బజారుకు రావడం లేదు. ఇవాళ బ్రహ్మాండంగా నీళ్లు వస్తున్నాయి. ఇది అభివృద్ధి కాదా..? ఇవన్నీ ఆలోచించాలి. ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావడానికి ఇవి తొలి అడుగులు అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## కొత్త గాలి ఎటో?




హైదరాబాద్ : తొలిసారి ఓటు హక్కు వచ్చిన సందర్భం.. తొలిసారి ఓటు వేసిన సందర్భం ఎప్పటికీ గుర్తుండిపోతుంది! ఈ ఎన్నికల్లో రాష్ట్రంలోని దాదాపు 10లక్షల మంది యువత అలాంటి మధుర జ్ఞాపకాన్ని పొందనున్నారు. ఈ నెల 30న జరగనున్న శాసనసభ ఎన్నికల్లో 9.99 లక్షల మంది ఓటు హక్కును మొదటిసారి వినియోగించుకోనున్నారు. ఎన్నికల సంఘం విడుదలచేసిన ఓటర్ల తుదిజాబితా ప్రకారం రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో 3.26 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వారిలో.. 18 ఏళ్లు పూర్తిచేసుకుని తొలిసారి ఓటు వేయనున్న వారి వాటా 3.06 శాతం ఉంది. 110 నియోజకవర్గాల్లో కొత్త ఓటర్ల సంఖ్య 5 వేలకు పైగా ఉంది. 20 నియోజకవర్గాల్లో వారి సంఖ్య 10 వేలకు పైగా, 11 నియోజకవర్గాల్లో 12 వేలకు పైగా ఉంది. పలు నియోజకవర్గాల్లో గెలుపోటములను 1-2 శాతం ఓట్లు నిర్ణయిస్తున్న నేపథ్యంలో.. 3.06 శాతం ఉన్న యంగ్ ఓటర్లు నిర్ణయాత్మకం కానున్నారు. 2018 ఎన్నికల్లో తొలిసారి ఓటు హక్కు పొందినవారి సంఖ్య 7లక్షలుగా ఉండగా, ఈసారి దాదాపు 3 లక్షలమంది అధికంగా ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది ప్రారంభంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితా ప్రకారం రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 2,99,74,919. అక్టోబరు 4న విడుదల చేసిన జాబితా ప్రకారం ఆ సంఖ్య 3,17,17,389కి పెరిగింది. తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య 3,26,182,05. అంటే.. అక్టోబరు 4నుంచి ఆ నెలాఖరులోపు 8,85,478 మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు.




బొమ్రాస్‌పేట్: గత పదేళ్లు అధికారంలో ఉన్న భారాస.. ఇచ్చిన హామీలు నిలబెట్టుకుందా అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోరారు. కొడంగల్‌ను దత్తత తీసుకుంటామని.. నీళ్లు తీసుకొస్తామని చెప్పిన నేతలు.. అలాగే చేశారా? అని నిలదీశారు. కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్రాస్‌పేట్‌లో నిర్వహించిన రోడ్ షోలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. "కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.. రోడ్లు వేశాం. ఈ పదేళ్లు భారాస పేదల కోసం ఏమీ చేయలేదు. ఇప్పుడొచ్చి కేసీఆర్ మళ్లీ మనల్ని ఓట్లు అడుగుతున్నారు. మందుపోయాలి, ఓటుకు రూ.10 వేలు ఇవ్వాలనేదే వారి ఆలోచన. రూ.లక్షల కోట్లు సంపాదించుకోవడమే భారాస నేతల లక్ష్యం. కేసీఆర్.. బంగారు తెలంగాణలో పేదలకు ఎంత బంగారం పంచారు? బంగారు తెలంగాణ సంగతి దేవుడెరుగు.. ఉన్న బంగారాన్ని అమ్ముకునే పరిస్థితి వచ్చింది. ప్రజలు కష్టాలు అర్థం చేసుకున్నాం కాబట్టే తెలంగాణలో మరోసారి ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని నిర్ణయించాం. అందుకే 6 గ్యారంటీలు ప్రకటించాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు.



# కాంగ్రెస్ ఎప్పటికీ పేదల పార్టీనే

## కాంగ్రెస్‌కు అధికారమిస్తే కులగణన చేపడతాం: రాహుల్ గాంధీ

వరంగల్: తెలంగాణలో కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి స్పష్టం చేశారు. వరంగల్ రుద్రమదేవి కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. "ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనా ఆ రాష్ట్రంలో ప్రతి పైసా పేదలకే వెళ్తుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తాం. కాంగ్రెస్ ఎప్పటికీ పేదల పార్టీనే, భారాస, భాజపా నేతలు కొంత మందికి మాత్రమే లబ్ధి చేకూరుస్తారు. ప్రధాని నరేంద్రమోదీ తన మిత్రుడు అదానీకి, సీఎం కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు లాభం చేకూరుస్తారు. తెలంగాణ రాష్ట్రం సాకారమైన తరువాత దళితులు, మైనారిటీలు, అణగారిన వర్గాలు లాభపడతాయని అనుకున్నాం. కానీ అలా జరగలేదు. అందుకే మా ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కులగణన చేపడతాం. ఏఏ కులాలు వెనకబాటుకు గురయ్యాయో తెలుసుకొని అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం. భారత్ జోడో యాత్ర సందర్భంగా కన్యాకుమారి మొదలుకొని కశ్మీర్ వరకు పాదయాత్ర చేశాను. ఆ సమయంలో ఆరెస్సెస్, భాజపా ప్రజలను ఏ విధంగా విభజిస్తున్నాయో అర్థమైంది. ఇది విద్వేషాలు రగిలించే దేశం కాదు ప్రేమను పంచే దేశం అని చెప్పదల్చుకున్నా. భాజపా, భారాస ఒక్కటే. ఒకరు దిల్లీలో పనిచేస్తే.. మరొకరు తెలంగాణలో పనిచేస్తున్నారు. ఈ రెండు పార్టీలు ఒకదానికొకటి సహకరించుకుంటున్నాయి. తెలంగాణలో భాజపా నాయకులు కొన్నాళ్లు హడావిడి చేసి ఇప్పుడు చప్పుడు చేయకుండా ఉన్నారు. భారాసను గెలిపించడానికి వారు పనిచేస్తున్నారు. లోక్‌సభలోనూ ఈ రెండు పార్టీలు కలిసిమెలిసి ఉన్న విషయాన్ని నేను సభలో గమనించాను. అన్ని బిల్లులకు భారాస మద్దతు ఇచ్చింది. ఇక్కడ మరో పార్టీ ఉంది. అదే ఎంఐఎం. ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భాజపాతో కొట్లాడుతుందో అక్కడ ఆ పార్టీ అభ్యర్థులను నిలబెడుతుంది. భాజపా నుంచి డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తుంది. కేసీఆర్‌ను గద్దె దింపడమే మా ఏకైక లక్ష్యం. ఆ తరువాత దిల్లీలోని నరేంద్రమోదీని గద్దె దింపుతాం. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై తొలి మంత్రివర్గంలోనే నిర్ణయం తీసుకొని సంతకాలు పెట్టిస్తా" అని రాహుల్ వివరించారు.

**బీజేపీ గాలిని వాళ్లే తీసుకున్నారు :** తెలంగాణ ఇస్తే పేదలకు మంచి జరుగుతుందని భావించామని, అయితే వారికి ఎలాంటి మేలు జరగలేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వరంగల్ ఈస్ట్ నియోజకవర్గంలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. కాంగ్రెస్ గెలవగానే రాష్ట్రంలో కులగణన చేపడతామన్నారు. కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు పెంచిందని విమర్శించారు. ప్రజలను విభజించి రాజకీయ లబ్ధి పొందాలనేది బీజేపీ కుట్ర అని మండిపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని రాహుల్ ఆరోపించారు.

బీజేపీ బండిలో గాలిని ఆ పార్టీయే తీసుకుందని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళల బ్యాంకు ఖాతాలో ప్రతి నెల రూ.2,500 వేస్తాం. రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇస్తాం. విద్యార్థుల చదువు, కోచింగ్ కోసం యువ వికాసం కింద రూ.5 లక్షలు ఇస్తాం. చేయూత పథకం కింద వృద్ధులు, వితంతువులకు ప్రతి నెల రూ.4 వేలు ఇస్తాం. కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు మాత్రమే మేలు చేస్తారు. ప్రధాని మోదీ ధనికులైన తన స్నేహితులకు మాత్రమే మేలు చేస్తారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం పేదలను గుర్తించి ప్రతి ఒక్కరికి మేలు చేస్తుంది' అని రాహుల్ తెలిపారు.

# సంపాదకీయం

## మోడీ గ్యారెంటీలను జనాలు నమ్ముతారా ?

నరేంద్రమోడీ ప్రధానమంత్రి హోదాలో ఇవ్వబోయే గ్యారెంటీలనే ఎన్నికల్లో బీజేపీ మ్యానిఫెస్టోగా ప్రచారం చేసుకోబోతోంది. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లోను బీజేపీ ప్రత్యేకంగా మ్యానిఫెస్టో అని కాకుండా కొన్ని గ్యారెంటీలను ప్రకటించింది. తెలంగాణాలో కూడా అలాంటి గ్యారెంటీలను ఈనెల 17వ తేదీన ప్రకటించబోతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలంగాణాకు రాబోతున్నారు. మోడీ గ్యారెంటీ పేరుతో చేసే ప్రకటననే పార్టీ మ్యానిఫెస్టోగా బీజేపీ అభ్యర్థులు ప్రచారం చేసుకోవాలి. అర్హులైన ప్రతి పేదవాడికి ఉచిత విద్య, వైద్యం, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్, వరికి కనీస మద్దతును రు. 3100కి పెంచటం, ఆయుష్మాన్ భారత్ కింద ప్రస్తుతం ఉన్న రు. 5 లక్షలను రు. 10 లక్షలకు పెంచటం, వివాహం అయిన ప్రతి మహిళకు ఏడాదికి రు. 12 వేలు, రు.500కే సిలిండర్, తెలంగాణాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు లాంటి హామీలు చాలానే ఇవ్వబోతున్నారు. విచిత్రం ఏమిటంటే సిలిండర్ ధరను ఒకవైపు వెయ్యిరూపాయాలు దాటించింది మోడీ ప్రభుత్వమే. మళ్ళీ ఎన్నికల్లో రు. 500 కే సిలిండర్ అని హామీ ఇవ్వబోతున్నదీ బీజేపీనే. అలాగే వరికి మద్దతు ధరను రు. 3100కి ఇంత కాలం ఎవరు పెంచద్దన్నారు ? ఎందుకింత కాలం పెంచలేదు ? ఆయుష్మాన్ భారత్ మొత్తాన్ని రు. 5 లక్షల నుండి రు. 10 లక్షలకు ఇంతకాలం ఎందుకు పెంచలేదు ? ఎన్నికల సమయంలోనే పెంచాలని అనిపించిందా ? అనే సందేహం పెరిగిపోతోంది. తన పరిధిలో చేయాల్సిన విషయాలను కూడా ఇంతకాలం గాలికి వదిలిపెట్టేసి ఇపుడు ఎన్నికల ముందు సడెన్ గా జనాలకు వరాలు ఇస్తామంటే ఎలాగ నమ్ముతారు ? ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు ఏమాత్రం విలువుంటుందో జనాలకు అంత మాత్రం తెలీదా ? లేకపోతే ఎలాగూ గెలిచే అవకాశంలేదు కాబట్టి బుర్రకు తోచిన హామీలను మోడీ గ్యారెంటీల పేరుతో ఇచ్చేస్తే ఓ పనైపోతుందని అనుకుంటున్నారా ? అనే సందేహాలు పెరిగిపోతున్నాయి. మరి మోడీ గ్యారెంటీలు రిలీజ్ అయిన తర్వాత జనాలు ఎలా స్పందిస్తారో చూడాలి.

# డబ్బు వెదజల్లే వారిని కాక, సమస్యలు తీర్చే వారిని ఎన్నుకోండి...

**మేడ్చల్ నియోజకవర్గ, బిజెపి అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి**
**కేంద్ర ప్రభుత్వం కేవలం అలియాబాద్ గ్రామానికే కోట్ల రూపాయల నిధులు ఇచ్చింది...**
**బిజెపి పార్టీ సీనియర్ నాయకుల, మాజీ వైస్ ఎంపిపి హృదయ కుమార్**







శామీర్ పేట (గరుడ వార్త) : డబ్బులు వెదజల్లే వారిని కాకుండా, నిత్యం ప్రజల్లో ఉంటూ... ప్రజల సమస్యలు తీర్చే వారిని ఎన్నుకోవాలని మేడ్చల్ నియోజకవర్గ, బిజెపి అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని షామీర్పేట్ మండల్ అలియాబాద్ గ్రామంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకుల హృదయ కుమార్ అధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఎన్నికల ప్రచారం భారీ ర్యాలీతో తన నిర్వహించారు. ముందుగా సుదర్శన్ రెడ్డికి అలియాబాద్ గ్రామస్తులు భారీ స్థాయిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి గ్రామ ప్రధాన కూడలిలో ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... కెసిఆర్ ప్రభుత్వం ప్రజల్ని మాయమాటలతో మభ్యపెడుతుందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు గాని, దళిత బంధు పథకం కానీ అర్హులకు లభించలేదని అన్నారు. ఇక మంత్రి మల్లారెడ్డి ఓ వ్యాపారవేత్తన్ని, తాను మేడ్చల్ నియోజకవర్గం వ్యాపారం చేయడానికి వచ్చాడని, తన కళాశాలలను కాపాడుకునేందుకే తాను దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆయన ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. కరోనా వంటి సమయాల్లో సైతం దేశాన్ని ప్రజల్ని సురక్షితంగా ఆరోగ్యవంతులుగా కాపాడుగలిగిందని అన్నారు. తనకు ఒక అవకాశం ఇస్తే, తప్పకుండా అనునిత్యం మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ... వారి సమస్యలను సత్వరం పరిష్కరిస్తానంటూ ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బుద్ధి శ్రీనివాస్, పట్నం నర్సింహ రెడ్డి, కైరా యాదగిరి, జగన్ గౌడ్, రాజు గౌడ్, పవన్ గౌడ్ , మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఎస్టీ మోర్చా నాయకులు సుధాకర్ నాయక్, అంకుషా పూర్ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చందర్ రెడ్డి, సరయు, బీజేవైఎం సంపత్, మామిళ్ల అశోక్, మాజీ ఎంపీపీ హృదయ కుమార్, మంచినీళ్ల లక్ష్మణ్, అల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జిల్లాలో ఎన్నికలకు సంబంధించి అధికారులందరూ సంసిద్ధంగా ఉండాలి...

**ఓటరు స్లిప్పులు పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు తప్పకుండా నిర్వహించాలి..**
**ఆర్వోలు, ఏఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.**




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని ఈ విషయంలో ఎప్పటికప్పుడు వారికి అప్పగించిన విధులు నిర్వహించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కలిసి జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు) లతో ఓటరు స్లిప్పుల పంపిణీ, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు, వెబ్కాస్టింగ్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందని, ఇంటింటికీ వెళ్ళి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని దీంతో పాటు పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు స్లిప్పుల ముద్రణ చేసి వాటి పంపిణీ పకడ్బందిగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ అంశంలో ఫిర్యాదులు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ను రాజకీయ పార్టీలప్రతినిధులకు ముందస్తుగా తెలియజేయాలని, వివిధ రాజకీయ పార్టీల బీఎల్ఏలను సైతం ఓటరు స్లిప్పుల పంపిణీలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. జిల్లాలో పోస్టల్ బ్యాలెట్కు సంబంధించి 6,449 మంది ఉన్నారని... పోస్టల్ బ్యాలెట్ వినియగుచుకొందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం రూట్మ్యాప్ తయారు చేసుకొని ముందుస్తుగా వారికి ఈ విషయంలో ఎలాంటి లోటుపాట్లు, సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సిబ్బందికి, పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించామని అందుకు తగినట్లుగా వారు ఎన్నికల విధులను నిర్వహించాలన్నారు. ఈ విషయంలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటవెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల సమయంలో స్ట్రాంగ్రూమ్, పోలింగ్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాల వివరాలను పూర్తి సమాచారంతో తెలిసి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. అలాగే పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని, దీనికి అవసరమైన మేరకు యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని, స్థానికంగా అందుబాటులో ఉండే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం ముందుకెళ్ళాలని ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అదనపు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బుద్ధి శ్రీనివాస్, పట్నం నర్సింహ రెడ్డి, కైరా యాదగిరి, జగన్ గౌడ్, రాజు గౌడ్, పవన్ గౌడ్ , మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఎస్టీ మోర్చా నాయకులు సుధాకర్ నాయక్, అంకుషా పూర్ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చందర్ రెడ్డి, సరయు, బీజేవైఎం సంపత్, మామిళ్ల అశోక్, మాజీ ఎంపీపీ హృదయ కుమార్, మంచినీళ్ల లక్ష్మణ్, అల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనే అభివృద్ధి ...

**అందుకే వలసలు వెల్లువెత్తుతున్నాయి...**
**సీనియర్ నాయకులు వంగ లక్ష్మారెడ్డి**




శామీర్ పేట (గరుడ వార్త) : కాంగ్రెస్ అధికారంలోకొస్తే నే తమ జీవితాలు బాగుపడుతాయని మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు బలంగా బావిస్తున్నారని, అందుకే రోజు రోజుకు కాంగ్రెస్ పార్టీలో వలసలు వెల్లువెత్తుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మూడు చింతలపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో , సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, వంగ లక్ష్మారెడ్డి, ఆధ్వర్యంలో మూడుచింతలపల్లి గ్రామ ఉపసర్పంచ్ వెంకటరమణారెడ్డి తో పాటు మండల పరిధిలోని గ్రామాలలోని, యువకులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా వంగ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ ను ఓటు వేసి గెలిపించుకుందామని కోరారు.తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేద్దామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోమ్మలపల్లి నర్సింలు యాదవ్, వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ భూపాల్ రెడ్డి, నాయకులు వేణుగోపాలరావు, రాజేంద్ర ప్రసాద్ గౌడ్, జెర్రిపోతుల నరసింహులు,కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు,యవకులు పాల్గొన్నారు.

# ధాన్యం తూకాల్లో కోతలు.. రైతుల వెతలు

జనగామ : ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నకు అడుగడుగునా కష్ట, నష్టాలు తప్పడం లేదు. చివరికి ధాన్యం అమ్ముకునేందుకూ ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వడగళ్ల వానతో వందల ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. వరి కోతలు పూర్తయ్యాక ధాన్యాన్ని నిల్వ చేయడం, నాణ్యతా ప్రమాణాలకను గుణంగా సిద్ధం చేసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత మిల్లర్లు నాణ్యత, తాలు పేరిట కోతలు విధిస్తున్నారు. ఒక్కో బస్తాకు కిలో చొప్పున కోతలు పెడుతున్నారు. కొనుగోళ్లు పూర్తయినా రైతులకు కొనుగోలు పత్రాలను అందించడం లేదు. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు.

**నత్తనడకన కొనుగోళ్లు..**

జిల్లాలో యాసంగి సీజన్‌లో 1.91 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వ్యవసాయశాఖ అధికారుల అంచనా మేరకు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో ప్రైవేటు, రైతుల అవసరాలకు పోను 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావించారు. వడగళ్ల వానలతో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా.. దిగుబడి మరింత తగ్గింది. అయినప్పటికీ కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

**తరుగు పేరిట మిల్లర్ల దోపిడీ**

ధాన్యంలో తాలు పేరిట మిల్లర్లు ఒక్కో బస్తాకు కిలో చొప్పున.. ఒక్కో కేంద్రంలో ఒక్కో విధంగా తరుగు తీస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. తాలు గింజలు ఉండటంతో తాము ఎఫ్‌సీఐ నిబంధనల మేరకు ఇవ్వాల్సిన బియ్యంలో తరుగు వస్తోందని, ఆ తరుగును రైతులు భరించాల్సిందేనని మిల్లర్లు పేర్కొంటున్నారు.



కొన్ని కేంద్రాల్లో రైతులు మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేయడం, నిలదీయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బచ్చన్నపేటపేట మండలంలోని తమ్మడపల్లి, బచ్చన్నపేట, పోచన్నపేట, చిన్నరాంచర్ల, కొన్నె, పడమటికేశ్వాపూర్ గ్రామాల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాకు కిలో చొప్పున కోతలు విధిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. పాలకుర్తి మండలంలోని గూడూరు, విస్నూరు, పాలకుర్తి, దర్దేపల్లి, మల్లంపల్లి తదితర గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలో నుంచి రెండు కిలోల చొప్పున కోతలు పెడుతున్నారు. జనగామ మండలంలోని సిద్దెంకి, ఎర్రకుంటతండా, పెద్దపహాడ్, పెద్దరాంచర్ల గ్రామాల్లోని కేంద్రాల్లో బస్తాకు కిలో చొప్పున కోతలు విధించడం, కొనుగోలు పత్రాలు ఇవ్వక పోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

**అకాల వర్షాలతో దిగుబడి తగ్గింది–ఏదు బాలరాజు, పెద్దపహాడ్, జనగామ మండలం**

యాసంగిలో ఐదెకరాల్లో వరి సాగు చేశా. ప్రతి ఏటా 350 బస్తాలకు పైగా ధాన్యం వచ్చేది. ఈ ఏడాది అకాల వర్షంతో 157 బస్తాల దిగుబడే వచ్చింది. ధాన్యాన్ని అమ్ముకునేందుకు గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాం. యాసంగి సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు గతంలో ఎన్నడూ లేనంత నష్టం వచ్చింది. మిగిలిన ధాన్యానికి సైతం రైస్ మిల్లర్లు కోతలు విధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు మరింత నష్టం కలిగించొద్దు.

**కొనుగోలు పత్రాలు ఇవ్వలేదు–చామంతుల చిరంజీవి, పెద్దపహాడ్, జనగామ మండలం**

యాసంగిలో మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఏటా 200 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చేది. అకాల వర్షాలతో 95 బస్తాల దిగుబడి వచ్చింది. పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఐదు రోజుల క్రితం ధాన్యాన్ని అమ్ముకున్నప్పటికీ నిర్వాహకులు కొనుగోలు పత్రం ఇవ్వలేదు. ధాన్యంలో తరుగు తీసేందుకే పత్రాలు ఇవ్వడం లేదు.

**మా దృష్టికి తీసుకురండి–సంధ్యారాణి, పౌరసరఫరాలశాఖ డీఎం**

జిల్లా పరిధిలోని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైస్ మిల్లర్లు, అధికారులు, సిబ్బంది కోతలు విధిస్తే రైతులు నేరుగా మా దృష్టికి తీసుకురావాలి. రైస్ మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు.

# మరిన్ని పోషకాలతో రాగి జావ

జనగామ : విద్యార్థులకు పోషకాహారం అందించే లక్ష్యంతో బెంగళూరుకు చెందిన అన్నపూర్ణ ట్రస్టు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం దుబ్బగుంటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాగిజావ అందిస్తోంది. అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో త్వరలో ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అమలు కానుంది. రాగిజావలో మరిన్ని పోషకాలు చేర్చి విద్యార్థులకు అందించనున్నారు. దీంతో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు రాగిజావ అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

గతంలో ఇలా..విద్యార్థుల్లో ఐరన్, జింక్, క్యాల్షియం లోపం అధికంగా ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. దీంతో మండల వనరుల కేంద్రాల ద్వారా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పోషకాహార పొట్లాలను అందించేవారు. రాగుల పొడి, బెల్లం మిశ్రమాన్ని వేర్వేరుగా కిలో పొట్లాల చొప్పున అందించేవారు. పాఠశాలల్లో ఈ రెండింటినీ వేడి నీటిలో కలిపి విద్యార్థులకు అందించేవారు. ఇది అదనపు పనిగా నిర్వాహకులు గమనించారు.ఇక నుంచి..ప్రధానంగా రాగులు, బెల్లం మిశ్రమానికి.. నిపుణులు సూచించిన పరిమాణంలో మరో ఏడు రకాల వస్తువులను కలిపి పొట్లాలుగా తయారు చేసి అందించనున్నారు. వీటిలో రాగి, బెల్లం, సోయా, బియ్యం పిండి, ఉప్పు, దాల్చిన చెక్క, పసుపు మిశ్రమంతో తయారు చేస్తున్నారు. 200 మి.లీ. వేడి నీటిలో పది గ్రాముల మిశ్రమాన్ని కలిపి తయారు చేసిన ద్రావణాన్ని విద్యార్థులకు అందిస్తే సరిపోతుందని జిల్లా సమన్వయ కర్త గొట్టె కనకయ్య తెలిపారు.

**ఉపాధ్యాయుల చౌరవ అవసరం–చిర్ర నరేందర్‌రెడ్డి, విశ్రాంత సైనికాధికారిఉపాధ్యాయులు చొరవ తీసుకొని..**

మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీ మహిళలతో ఉదయం పాఠశాల ప్రారంభానికి ముందే రాగిజావ తయారు చేయించాలి. దీంతో ప్రతి విద్యార్థి నిత్యం ప్రార్థనకు హాజరవడమే కాక, అల్పాహారం కోసం ఇంట్లో తల్లిపై ఆధారపడరు. అదనంగా పని చేసే వంట కార్మికులకు దాతల సహకారంతో ప్రతి నెలా కొంత పారితోషికం ఇప్పించాలి. పాలకుర్తి మండలం వావిలాల పాఠశాలలో వంట ఏజెన్సీ మహిళలకు దాత గంటా రవీందర్ ప్రతి నెలా అదనంగా రూ.1500 అందిస్తున్నారు.

# ఎన్నికల పండగ.. ఉపాధి దండిగా!

జయశంకర్ : అయిదేళ్లకోసారి వచ్చే ఎన్నికల పండగ పలు రంగాల వారికి ఉపాధి చూపిస్తోంది. ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎన్నికల్లో ఖర్చులు పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. పార్టీలు, అభ్యర్థులతో సంబంధం లేకుండా కేవలం జీవనం కోసం పనులుచేసే వారికి పైసలు దండిగానే లభిస్తున్నాయి. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి సై అనటం, అభ్యర్థులు పోటాపోటీగా ఖర్చుకు వెనుకాడకుండా సందడి చేస్తుండటంతో కూలీల నుంచి కళాకారుల వరకు, చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపారుల వరకు బాగానే ఆర్జిస్తున్నారు.పొందుతున్న వారిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

కళాకారుల సందడి

అభ్యర్థుల ప్రచారం జానపద కళాకారుల బృందం సందడితో సరికొత్త శోభను సంతరించుకుంటోంది. ఊరూరా తిరుగుతూ పాటలు, మాటలతో సందడి చేస్తూ ఓ బృంద సభ్యులు రోజుకు రూ.10 వేల నుంచి 20 వేల వరకు పొందుతున్నారు. గాయకులతో పాటలు పాడించి, సీడీలను రూపొందిస్తున్నారు. రోజుకు రూ.2 వేలు, వారానికి రూ.10 వేల వరకు ముట్ట జెప్పుతున్నారు.

విందు... పసందు..

ప్రచారానికి వచ్చే ఒక్కొక్కరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం కల్పిస్తున్నారు. అల్పాహారానికి రూ.25-30, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి రూ.120-140 లెక్కన ఒక్కో వ్యక్తికి రోజుకు రూ. 170 ఖర్చు చేస్తున్నారు. వంట చేసే వారితోపాటు కూలీలు, క్యాటరింగ్ సేవలకు డిమాండ్ పెరిగింది. పేపర్ ప్లేట్ల తయారీదారులకు సైతం ఉపాధి పెరిగింది.

ప్రచార రథాలకు.. వాహనాలకు..

జిల్లాల్లో అభ్యర్థుల ప్రచార వాహనాలకు మూడు వైపులా ఫ్లెక్సీలు, లోపల డీజే ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారులు, డీజేలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో వాహనానికి రోజుకు రూ.4 వేల నుంచి రూ.6వేల



వరకు ఖర్చు చేస్తున్నారు. అభ్యర్థి వెంట 5 నుంచి 10 వాహనాలు వినియోగిస్తున్నారు.

కరపత్రాల ముద్రణ, ఫ్లెక్సీల తయారీ

కరపత్రాలు, ఫెక్సీల దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఒక్కో అభ్యర్థికి వేలాదిగా కరపత్రాలు, ఫెక్సీలు అవసరం. ఒక్కో కరపత్రానికి రూ.3 నుంచి 5, ఫ్లెక్సీకి సైజును బట్టి రూ.400 నుంచి రూ వేలల్లో ఖర్చు చేస్తున్నారు. ఈ లెక్కన అభ్యర్థికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

వీడియోగ్రాఫర్లకు చేతినిండా పని...

అభ్యర్థుల ప్రచార చిత్రాలు, వీడియోలు తీసేందుకు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ఎన్నికల ప్రచారం పూర్తయ్యేవరకు ఒక్కో ఫొటోగ్రాఫర్ రూ.20 వేల నుంచి రూ.30 వేలు, వీడియోగ్రాఫర్‌కు రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

పూలకు భలే గిరాకీ..

ప్రచారానికి వచ్చే అభ్యర్థికి ద్వితీయ శ్రేణి నాయకులకు పూల దండలు వేయడానికి నాయకులు, కార్యకర్తలు పోటీ పడుతున్నారు. ప్రచారంలో అభ్యర్థిపై పూలవర్షం కురిపిస్తున్నారు. కిలో వంద వరకు విక్రయిస్తున్నారు. దీంతో పూల వ్యాపారానికి కూడా గిరాకీ పెరిగింది. బంతిపూలు, గులాబీ, చామంతి దండలకు రూ.150 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు.

మద్యం అమ్మకాల జోరు..ప్రచారంలో పొద్దంతా తిరిగిన నాయకులు, కార్యకర్తలు రాత్రి వేళల్లో మద్యంతోపాటు పసందైన భోజనం పెట్టిస్తుంటారు. ప్రచారం ముగియగానే ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1000 వరకు ఇవ్వడంతోపాటు బిర్యానీ, మద్యం అందిస్తున్నారు. సాయంత్రం వేళ మద్యం దుకాణాల ముందు బారులు తీరుతున్నారు.

టెంట్ హౌస్‌లు, కుర్చీలు

అభ్యర్థులు సభలో మాట్లాడేందుకు డివిజన్ స్థాయి నాయకులు టెంట్లు కుర్చీలు వేయాలి. సభలను బట్టి ధరలు ఉంటాయి. రూ. 5 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకుంటున్నారు. ఎన్నికల పుణ్యమా అని గిరాకీ పెరగగడంతో నిర్వాహకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోలు బంకుల్లో క్యూ..

ఎన్నికల ప్రచారంలో ఒక్కో అభ్యర్థి పదుల సంఖ్యలో కార్లు, ర్యాలీల వేళ వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు వినియోగిస్తున్నారు. ఈ వాహనాలకు పెట్రోల్ అవసరం కావడంతో అమ్మకాలు రెట్టింపయ్యాయి. వాహనానికి రూ.100 నుంచి రూ.500 వరకు చెల్లిస్తున్నారు.

కూలీలకు డిమాండ్..

వ్యవసాయ పనులతోపాటు ఎన్నికల ప్రచారం మొదలవడంతో కూలీల అవసరమే కీలకంగా మారింది. అభ్యర్థుల ప్రచారం, సభలలో నిండుదనం ఉండాలంటే కూలీలే కీలకంగా మారారు. వ్యవసాయ పనులకు వెళితే.. రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు ఇస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే ఒక్క కూలీకి రెండు పూటలా భోజనం పెట్టి రూ.700 నుంచి రూ.800 వరకు ఇస్తున్నారు.

# మిల్లర్లు బియ్యం అందజేయాలి

సిరిసిల్ల : మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని వెంటనే అందజేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. సిరిసిల్ల పట్టణ పరిధిలో రగుడులోని శ్రీవేంకటేశ్వర రైస్‌మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తంగళ్లపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లె, నేరెల్ల, నాంపల్లి కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తప్పకుండా రైతుల కోసం కనీస వసతులు కల్పించాల న్నారు. రైతులకు తొందరగా ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని వెంటనే అందజేసినట్లయితే ఈ వానాకాలం 2023-24 ధాన్యం దిగుమతి చేసుకోవడానికి స్థలం అందుబాటులో ఉంటుందన్నారు. దానివల్ల జిల్లాలో ఉన్న ధాన్యం మన జిల్లాకే కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకం వేసిన ధాన్యం తొందరగా మిల్లులకు తరలించాలన్నారు. వాహనాలు ఎక్కువ సంఖ్యలో వేచి ఉండకుండా తొందరగా దిగుమతి చేసేకునే విధంగా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానా యక్, జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీఆర్‌డీవో నక్క శ్రీనివాస్, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు, మిల్లర్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# నాడు కరువుతో తల్లడిల్లిన ఆలేరులో.. సాగుకు జీవం పోసిన కాళేశ్వరం జలాలు



యాదాద్రి : తెలంగాణకు ముందు యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గం కరువుతో తల్లడిల్లింది. వరుస కరువులతో జనం వలసలు వెళ్లిన దుస్థితి ఉండేది. స్వరాష్ట్రం సిద్ధించాక నియోజకవర్గ రూపురేఖలు అమాంతంగా మారిపో యాయి. కాళేశ్వరం జలాలతో పలు మండలాలు సస్యశ్యామలమయ్యాయి. బీడు భూముల్లో పుష్కలంగా ధాన్యం పండుతున్నది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కృషితో నియోజకవర్గం అన్ని రంగాల్లో దూసుకెళుతున్నది.కాళేశ్వరం ప్రాజెక్ట్ ఫలాలు యాదాద్రి భువనగిరి జిల్లాను తాకాయి. సీఎం కేసీఆర్ అపర భగీరథుడై ఎక్కడో పారుతున్న గోదారమ్మను జిల్లా అంతటా ప్రవహింపజేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి కృషితో 2020లో బొమ్మలరామారం, తుర్కపల్లి మండలాల్లో గోదావరి జలాలు పారించి రైతులకు కొత్త బతుకునిచ్చారు. బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా యాదగిరిగుట్ట నర్సన్న పాదాలను కాళేశ్వరం జలాలు ముద్దాడాయి. దేవాదుల ఎత్తిపోతలో భాగంగా నిర్మించిన నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి గుండాల మండలానికి గోదావరి జలాలను పారించారు.

చెక్‌డ్యాంల నిర్మాణం.. చెరువుల పునరుద్ధరణ

గతంలో బుక్లేరు, చొల్లేరు, బిక్కేరు వాగులతో పాటు ఆలేరు పెద్ద వాగు, పెద్ద కందుకూరు వాగులో నీళ్లు వృథాగా పోయేవి. బోర్లు ఎండిపోయేవి. కేసీఆర్ పాలనలో ఆయా వాగులపై 23 చెక్‌డ్యాంలు నిర్మించారు. ఇటీవల మరో 11 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మిషన్ కాకతీయ కింద 579 చెరువులు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. చెరువులు, కుంటల ఆధునీకరణకు రూ.112 కోట్లు ఖర్చు చేశారు. మిషన్ భగీరథ ద్వారా 324 ఆవాస గ్రామాలకు..74,306 ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న 277 ట్యాంకులకు అదనంగా మరో 216 నిర్మించారు. 1,022 కిలోమీటర్ల మేర గ్రిడ్, పైప్‌లైన్ వేసి ప్రతి గ్రామంలో ట్యాంక్‌లు శుద్ధి చేసి గోదావరి, కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నారు.

మెడికల్ కాలేజీ.. డయాలసిస్ సెంటర్

త్వరలో యాదగిరిగుట్టలో 20 ఎకరాల్లో మెడికల్ కాలేజీ నిర్మాణం కానున్నది. సెప్టెంబర్ 16న కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.183 కోట్లు కేటాయిస్తూ పాలనా అనుమతులను మంజూరు చేసింది. త్వరలోనే టెండర్ పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆలేరులో డయాలసిస్ సెంటర్ రోగుల పాలిట వరంగా మారింది.

అటు సంక్షేమం.. ఇటు అభివృద్ధి

నియోజకవర్గంలో 3 గురుకుల పాఠశాలలు ఏర్పాటయ్యాయి. 98,519 మంది రైతులకు రైతుబంధు, 1,020 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా అందింది. రూ.300 కోట్లతో కొత్త రోడ్లు నిర్మించారు. 15వేల మంది ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి సాయం అందింది. తుర్కపల్లిలో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు కోసం 93.21 ఎకరాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యింది.వాసాలమర్రిని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిని సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్నారు. గ్రామంలోనే దళిత బంధును పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. 75 మందికి దళిత బంధు వర్తింపజేశారు. 75 మందికి ఇండ్లు కట్టించే ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటికే పలు ప్రభుత్వ భవనాలు నిర్మించగా, మిగతా పనులు కొనసాగుతున్నాయి.యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం..ప్రభుత్వం రూ.1,280 కోట్లతో యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించింది. 2015లో దసరా రోజున సీఎం కేసీఆర్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా, 2022 మార్చి 28న ప్రధానాలయం పునఃప్రారంభమయ్యింది. ఆలయ నిర్మాణానికి 9.5 లక్షల ఘనపు మీటర్ల (2.5 లక్షల టన్నులు) కృష్ణశిలలను వినియోగించారు. ఆలయ గోపురాలు, మాడవీధులు, ప్రాకారాలు, గర్భగుడి, ధ్వజ స్తంభం, శివాలయం, క్యూలు, వంటశాల, పుషరిణి, యాగశాలను నిర్మించారు. కొండపైన విష్ణు పుషరిణి, కొండ దిగువన లక్ష్మీ పుషరిణి, స్వామివారి తెప్పోత్సవం కోసం గండిచెరువు, కల్యాణ కట్ట, దీక్షాపరుల మండపం, నిత్యాన్నదాన సత్రం, సత్యనారాయణస్వా మి వ్రత మండపం, ఆర్టీసీ, దేవస్థానం బస్టాండ్లు, గుట్ట చుట్టూ రెండు ఫ్లై ఓవర్లు నిర్మించారు.

# హెల్త్ సిటీగా చారిత్రక ఓరుగల్లు నగరం.. వరంగల్‌లో దేశంలోనే అతిపెద్ద దవాఖాన నిర్మాణం



వరంగల్ :35 విభాగాలు.. 77 యూనిట్లు.. 500 మంది వైద్యులు.. 1,000 మంది నర్సులు.. 24 అంతస్తుల భవనం.. 200 ఎకరాల సువిశాల ప్రాంగణం.. 1,100 కోట్ల రూపాయల ఖర్చు.. ట్విన్ సిటీస్ ప్రజల స్వప్నం.. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం.. దేశంలోనే అతిపెద్ద దవాఖాన నిర్మాణం.. హెల్త్ సిటీగా చారిత్రక ఓరుగల్లు నగరం.చారిత్రక నగరం వరంగల్ హెల్త్ సిటీగా మారుతున్నది. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ దవాఖానను వరంగల్‌లో కేసీఆర్ సర్కారు నిర్మిస్తున్నది. రూ.1,100 కోట్లతో 24 అంతస్తులు, అత్యాధునిక హంగులతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రూపుదిద్దుకుంటున్నది. దీనికి 2021 జూన్21న ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేయగా, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 35 విభాగాల ద్వారా వైద్యసేవలు అందించేలా ప్రణాళికలు చేశారు. గుండె, కాలేయ మార్పిడి ఆపరేషన్లతో పాటు క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన కీమోథెరపీ, రేడియేషన్ వంటి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉంటాయి. వరంగల్‌లో హెల్త్ సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో ఇప్పటికే కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. వరంగల్‌ను అత్యాధునిక వైద్య సేవల కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా 2014లో సీఎం కేసీఆర్ ఇక్కడ రాష్ట్రంలోనే ఏకైక హెల్త్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా పేరు పెట్టా రు. అనంతరం ఐదు ఎకరాల్లో రూ.25 కోట్లతో ఐదు అంతస్తులతో 69 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక భవనాన్ని నిర్మించారు. ఈ భవనం పక్కనే ఉన్న స్థలంలో ఇప్పుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులు సాగుతున్నాయి. వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్, కాకతీయ మెడికల్ కాలేజీ, కంటి దవాఖాన, సెంట్రల్ జైలు స్థలం కలిపి 200 ఎకరాల వరకు అవుతుందని.. ఆ ప్రాంతాన్ని ఇంటిగ్రేటెడ్ హెల్త్ కాంప్లెక్సుగా అభివృద్ధి చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీనిలో భాగంగానే వరంగల్ నగరానికి డెంటల్ (దంత), వెటర్నరీ కాలేజీలను మంజూరు చేశారు. ప్రస్తుత ఎంజీఎంను మాతాశిశు సంరక్షణ (ఎంసీహెచ్) కేంద్రంగా అభివృద్ధి చేసి ఒకేసారి 1500 మందికి సేవలందించేలా కొత్త భవనం నిర్మించాలనే ప్రణాళికలు ఉన్నాయి.

పర్యావరణ హిత భవనం


ఈ భవనాన్ని పూర్తి పర్యావరణ హితంగా నిర్మిస్తున్నారు. వైద్య సేవల కారణంగా ఉత్పన్నమయ్యే వ్యర్థాల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను నిర్మించనున్నా రు. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా గార్డెనింగ్ ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేకంగా స్టాఫ్ క్వార్టర్స్ నిర్మించనున్నారు.

10 సూపర్ స్పెషాలిటీ విభాగాలు

హెల్త్ సిటీ ఆవరణలోనే కాకతీయ మెడికల్ కాలేజీ ఉన్నది. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు అనుబంధంగా ఈ కాలేజీ ఉండనున్నది. అన్ని రకాల వైద్య సేవలకు అనుగుణంగా అత్యాధునిక హంగులతో కొత్త హాస్పిటల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. వైద్య సేవలకు సంబంధించి దాదాపు అన్ని డిపార్ట్‌మెంట్లు ఉండనున్నాయి. ఇందులో 35 విభాగాలు, 77 యూనిట్లు ఉంటాయి. రెండు వేల పడకలను ఏర్పాటు చేస్తారు. 500 మంది డాక్టర్లు, వెయ్యి మంది నర్సులు, పారామెడికల్ సిబ్బంది సేవలందించనున్నారు. ఐదు అంతస్తుల్లో ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తారు. ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. అవయవాల మార్పిడి కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నొస్టిక్స్, సర్జికల్, మెడికల్, ఐసీయూ విభాగాలు ఉంటాయి. శస్త్ర చికిత్సలు, అత్యవసర సేవల కోసం సెంట్రల్ స్టెరిలైజేషన్ యూనిట్‌ను నిర్మిస్తారు. రోగులు, డాక్టర్లు, వైద్య సిబ్బందికి సమయానికి ఆహారం అందించేందుకు సెంట్రల్ కిచెన్ ఉంటుంది.

# ఎన్నికల వేళ.. సరిహద్దులపై నిఘా!

జయశంకర్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతోంది.. అడవులకు నెలవుగా పేరొందిన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయడంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, అంతరాష్ట్ర సరిహద్దులపై నిఘా పెంచారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి జిల్లా పోలీసు యంత్రాంగంతో కలిసి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం గోదావరి వంతెన వద్ద, మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద, ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెం వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్రమంగా మద్యం, డబ్బు, ఇతర వస్తువుల తరలింపుపై ఆరా తీస్తున్నారు. అనుమానితుల విచారణ చేపడుతున్నారు. గోదావరి తీర ప్రాంతాల్లోని మహదేవపూర్, పలిమెల, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, వెంకటాపురం, మంగపేట ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించారు. మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరించాలంటూ పలు ప్రకటనలు విడుదల చేశారు. గత నెలలో




తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రిగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీన్ని పసిగట్టిన పోలీసులు ప్రత్యేక బలగాలతో తనిఖీ చేశారు. మావోయిస్టులు ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లారు. పోలీసులు పెద్దఎత్తున సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి సరిహద్దులపై పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. వెంకటాపురం మండలంలో గత నెలలో ఆరుగురు మావోయిస్టు కొరియర్లను అరెస్టు చేశారు. వారి నుంచి కరపత్రాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

మూడు రాష్ట్రాల పోలీసుల సమన్వయంతో..

మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో ఎన్నికలు సవాలుగా మారాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు సమన్వయంతో ముందుకెళ్తున్నారు. భూపాలపల్లిలో ఇటీవల ఈ మూడు రాష్ట్రాల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించుకున్నారు. ఇన్‌ఫార్మర్ల వ్యవస్థను బలోపేతం చేసుకొని సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలకు కేంద్ర బలగాలు కూడా చేరుకున్నాయి. భూపాలపల్లి, ములుగు జిల్లాలకు దాదాపు 50 నుంచి 70 వరకు ప్లాటూన్ బృందాలు వచ్చాయి. పోలీసు స్టేషన్ల వారీగా ప్రత్యేక బలగాలను పంపించారు. రెండు జిల్లాలో 220 వరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటితో పాటు మిగతా కేంద్రాల్లోనూ వీరి సేవలను వినియోగించుకోనున్నారు. ఆయా మండలాల్లో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు.

అణువణువూ శోధన..

జిల్లాల్లో ఎన్నికల సందర్భంగా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారు. ఏ చిన్న విషయాన్ని సాధారణంగా తీసుకోవడం లేదు. గోదావరి తీర ప్రాంతాల్లోని అడవుల్లో రెండు జిల్లాల పోలీసులు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి కూంబింగ్ చేస్తున్నారు. అటవీ మార్గాల్లో కల్వర్టులను తనిఖీ చేస్తున్నారు. గోదావరి ఫెర్రి పాయింట్ల సైతం నిఘా ఉంచారు.

కిరణ్ ఖరే, ఎస్పీ, జయశంకర్ భూపాలపల్లి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుండటంతో అంతరాష్ట్ర సరిహద్దులను ఏర్పాటు చేశాం. జిల్లాలకు ప్రత్యేక బలగాలు రానున్నాయి. గోదావరి తీర ప్రాంతాలపైనా దృష్టిసారించాం. అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాం. డబ్బు, మద్యం లాంటి ప్రలోభాలను కూడా నియంత్రిస్తున్నాం. రాబోయే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నాం.

# ప్రచారానికి ముందస్తు అనుమతి తప్పనిసరి

కరీంనగర్ : వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచారం కోసం 24 గంటల ముందుగా ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కేంద్ర ఎన్నికల జిల్లా పోలీసు పరిశీలకులు ఎ.సతీష్ గణేశ్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, సాధారణ, వ్యయ, పోలీసు పరిశీలకులు జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వీడియోను, ఫొటోను వాట్సాప్ లేదా సంక్షిప్త సందేశం ద్వారా పోలీసు వ్యయ పరిశీలకులు ఎ.సతీష్ గణేశ్ 94557 17500, సాధారణ పరిశీలకులు సి.ఆర్.ప్రసన్న 98464 42277 తెలియజేయాలని కోరారు. ఫిర్యాదులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లిన వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశంలేదన్నారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. పరిశీలకులు ప్రసన్న, రవికుమార్, శివ్‌శంకర్, చిట్టేయోగేష్, సుగ్దే తదితరులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సి.ఆర్.ప్రసన్నకుమార్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటింగ్ తర్వాత తన ఓటు ఎవరికి వేశాననే రహస్యాన్ని బయటపెట్టకుండా చూడాలని, వారికి కేటాయించిన క్రిటికల్ పోలింగ్ కేంద్రంలో వసతులు ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి, నోడల్ అధికారి పద్మావతి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# పాత ఓటర్లకు కొత్త గుర్తింపు

పెద్దపల్లి : శాసనసభ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా ఓటర్లకు కొత్త గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొందరి గుర్తింపు కార్డులు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ఈ విషయం ఎన్నికల సంఘం దృష్టికి వెళ్లడంతో నియోజకవర్గాల వారీగా అలాంటి వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించింది. వారికి కొత్త కార్డుల జారీ ప్రారంభించింది. 2012 కంటే ముందున్న గుర్తింపు కార్డుల్లో 12 అంకెలుండగా, కొత్త వాటిలో 10 అంకెలున్నాయి. కొత్త గుర్తింపు కార్డులు జారీ చేసే ముందు ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా లేఖలు అందించారు. తపాలా శాఖ ద్వారా నేరుగా ఇంటికే ఎపిక్(ఎలక్షన్ ఫొటో ఐడెంటిటీ కార్డు)లు పంపిస్తున్నారు. కార్డుతో పాటు ప్రతిజ్ఞ, ఓటు హక్కు వినియోగించుకోవాలనే సందేశాన్ని జత చేస్తున్నారు. కొత్త కార్డు రాకున్నా పాత కార్డుతో కూడా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

ప్రతిజ్ఞాపత్రం జత చేసి..

ఉమ్మడి రాష్ట్రంలో జారీ చేసిన గుర్తింపు కార్డులు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దీంతో ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. వీటన్నింటికీ ఏపీ సిరీస్‌కు బదులు కొత్త ప్రామాణిక సంఖ్య కేటాయించారు. గుర్తింపు కార్డుల కొత్త నంబర్లను బీఎల్‌వోలు ఇప్పటికే లేఖల ద్వారా ఓటర్లకు పంపిణీ చేశారు. ఇకపై నూతన ఎపిక్‌లోని పేరు, నంబరు తదితర వివరాలనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఓటరు చైతన్యంలో భాగంగా పలు సంస్కరణలు అమలు చేస్తున్న ఎన్నికల సంఘం మరో అడుగు ముందుకేసింది. ఓటు హక్కు నమోదు నుంచి వినియోగం వరకు పారదర్శక, నైతిక విలువలకు కట్టుబడి ఉండేలా ప్రజలకు తమ బాధ్యతలను గుర్తు చేస్తూ సందేశాత్మక పత్రాలను ముద్రించింది. 'స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేస్తాన'ని ప్రతిజ్ఞ పత్రం,



మరో సందేశాత్మక పత్రం కొత్త కార్డులతో కలిపి తపాలా శాఖ ఓటర్ల ఇంటికి చేరవేస్తోంది.

మొత్తం 5,94,217

ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల్లోని 12 నియోజకవర్గాలకు సంబంధించిన నూతన ఎపిక్‌లు కలెక్టర్లకు విడతల వారీగా చేరుతున్నాయి. వీటి పంపిణీకి అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. రామగుండంలో 27,077, మంథనిలో 52,299, పెద్దపల్లిలో 65,854, కరీంనగర్‌లో 34,177, చొప్పదండిలో 66,704, మానకొండూర్‌లో 69,694, హుజూరాబాద్‌లో 68,508, కోరుట్లలో 41,814, జగిత్యాలలో 51,716, ధర్మపురిలో 57,844, సిరిసిల్లలో 26,691, వేములవాడలో 31,839 కలిపి మొత్తం 5,94,217 కార్డులు కొత్తగా మంజూరయ్యాయి.

ఇంటికే కార్డులు.. మూడు నెలలుగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులు.. అదేస్థాయిలో కొత్త ఓటరు కార్డులను ఇంటింటికి పంపిణీ చేస్తూ ఓటుహక్కు ఆవశ్యకతను తెలుపుతున్నారు. జిల్లాలో పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో బూత్‌స్థాయి అధికారులను నియమించి ఓటరు జాబితాను పరిశీలించారు. బీఎల్వోలు ఇంటింటా తిరుగుతూ ఓటర్ల వివరాలు సేకరించారు. జిల్లాకు 1.07 లక్షల ఓటరు గుర్తింపు కార్డులు రాగా అందులో 99 వేలు బట్వాడా చేశారు. మిగతా 8 వేల కార్డులను రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు పోస్టల్ అధికారులు తెలిపారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లతోపాటు మార్పులు, చేర్పులు చేసుకున్న వారికి స్పీడ్ పోస్టు ద్వారా ఇంటికి చేరవేస్తున్నారు.

ఓటు హక్కుపై ఎన్నికల సంఘం లేఖ

ప్రజాస్వామ్యంలో ఓటు విలువను గుర్తు చేస్తూ జిల్లా ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ముద్రించిన ఆంగ్లం, తెలుగు భాషలో ఉన్న మీ ఓటు–మీ హక్కు పేరుతో లేఖను గుర్తింపు కార్డుతో పంపిస్తున్నారు. ఎన్నికల్లో మీ అభీష్టం మేరకు, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని అందులో పేర్కొన్నారు.

# బరిలో నిలిచేదెవరు?

కరీంనగర్ : మరికొన్ని గంటల్లో రంగంలో ఉండే అభ్యర్థులెవరనేది తేలనుంది. కీలకమైన నామినేషన్ల ప్రక్రియలోని తుది ఘట్టం ముగుస్తుంది. మధ్యాహ్నం 3 గంటలలోపు వేసిన నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంటుంది. మంగళవారం ఆయా నియోజకవర్గాల్లో అనుకున్న స్థాయిలో అభ్యర్థులు వైదొలగలేదు. కేవలం ఏడుగురు మాత్రం నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. 12 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తంగా 261 మంది నామపత్రాలు ఆమోదానికి నోచుకున్నాయి. ఇందులో ఏడుగురు ఉపసంహరించుకోగా.. మరో 254 మంది ఇంకా బరిలో ఉన్నారు. వీరిలో ఎంతమంది బుధవారం నామినేషన్లు ఉపసంహరించుకుంటారనే ఉత్కంఠ అందరిలో నెలకొంది. ఈసారి ప్రధాన పార్టీలైన భారాస, కాంగ్రెస్, భాజపా, బీఎస్పీల తరపున 48 అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉండటంతో వారంతా పోటీకి సిద్ధమయ్యారు. వీరితోపాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి 206 మంది ఉన్నారు. ఈ సారి ఎక్కువగా స్వతంత్రులు పోటీ పట్ల ఆసక్తిని చూపించారు. అన్ని నియోజకవర్గాల్లో సగటున అయిదారుగురు కచ్చితంగా పోటీలో ఉంటామనే సంకేతాల్ని ఇస్తున్నారు. గతంలోనూ ఈ స్వతంత్ర అభ్యర్థుల ప్రభావం నాలుగు జిల్లాల పరిధిలో ఎక్కువగానే ఉంది. ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలలోపు ఉపసంహరణ గడువు పూర్తవగానే.. గంటలకు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు.

రెండు ఈవీఎంల భయం ఈసారి అన్నిచోట్ల నామినేషన్లు దండిగా పడటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండు ఈవీఎంల ఏర్పాటుపై భయపడుతున్నారు. ఒక ఈవీఎంలో నోటాతో కలిపి 16 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుంది.

# భవనం.. భయం



హైదరాబాద్: నాంపల్లి బజార్‌ఘాట్‌లో తొమ్మిది మందిని బలితీసుకున్న అగ్నిప్రమాదంపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఘటనాస్థలాన్ని మధ్యమండలం డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, సైఫాబాద్ ఏసీపీ సంజయ్‌కుమార్, నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అభిలాష్ పరిశీలించారు. క్లూస్‌టీమ్ విభాగ అధికారి డాక్టర్ వెంకన్న పర్యవేక్షణలో ప్రమాదానికి కారణమైన రసాయనాలు, ప్లాస్టిక్ వస్తువులు తదితర నమూనాలను క్లూస్ బృందం సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. పరీక్షల్లో వచ్చే నివేదిక ఆధారంగా అగ్గి రాజుకునేందుకు అసలు కారణాలు బయటకొస్తాయని తెలిపారు. ప్రమాదం సంభవించిన బాలాజీ రెసిడెన్సీ భవనం ప్రమాదకరంగా ఉండటంతో అటువైపు రాకపోకలు నిలిపివేశారు. కాలనీకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసు బందోబస్తు ఉంచారు. నియంత్రిక పేలడంతో నిలిచిపో యిన విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. పేలుడు అనంతరం రహదారిపైకి చేరిన రసాయనాలపై జీహెచ్ఎంసీ, శానిటేషన్ సిబ్బంది మట్టి పోయించారు. డ్రమ్ములను మరో ప్రాంతానికి తరలించారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహ్మద్ తహ్లా(19) ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మరణించిన మహ్మద్ ఆజం కుటుంబ సభ్యులు ఆరుగురి అంత్యక్రియలు హబీబ్‌నగర్ మరుభూమిలో, డాక్టర్ జకీర్‌హుస్సేన్ కుటుంబంలోని ముగ్గురి అంత్యక్రియలు చాదర్‌ఘాట్‌లోని శ్మశానవాటికల్లో బంధువులు, స్నేహితులు పూర్తిచేశారు.

యజమాని కారు మాత్రం సురక్షితం

అపార్ట్‌మెంట్ యజమాని రమేష్ జైశ్వాల్(50) అగ్నిప్రమాదం జరిగినట్టు తెలియగానే అక్కడకు చేరాడు. అక్కడే ఉంచిన తన కారును భద్రంగా మరో ప్రాంతానికి తరలించాడు. బాధితులను కాపాడేందుకు ప్రయత్నించే క్రమంలో పొగతీవ్రతకు కళ్లు తిరిగి పడిపోవటంతో కుటుంబసభ్యులు లక్డీకాపూల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించి సాధారణంగా ఉన్నట్టు తేల్చారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో అతడే ప్రధాన నిందితుడు కావటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కాగానే అరెస్ట్ చేస్తామని డీసీపీ స్పష్టం చేశారు. నిందితుడు ఉన్న ఆసుపత్రి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జేఎన్‌టీయూ నిపుణుల పరిశీలనబజార్‌ఘాట్‌లోని అగ్ని ప్రమాద ఘటనపై జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. మంటల ధాటికి పెచ్చులూడి పోయిన బాలాజీ రెసిడెన్సీ భవనాన్ని ఉంచాలా, కూల్చాలా తేల్చుకునేందుకు నిపుణులను రంగంలోకి దించింది. బల్దియా కమిషనర్ రోనాల్డ్‌రాస్ సూచన మేరకు.. ఐదుగురు సభ్యుల జేఎన్‌టీయూ నిపుణుల బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. మెహిదీపట్నం సర్కిల్ అధికారుల సమక్షంలో నిపుణులు తనిఖీలు చేపట్టారు. మరమ్మతులు సరిపోతాయా, కూల్చడం తప్పదా అనే వివరాలతో బుధవారం జేఎన్‌టీయూ నిపుణులు నివేదిక ఇస్తారని జీహెచ్ఎంసీ పేర్కొన్నారు.

# వెన్నంటి నిలవండి.. మీ వెంటే నేనండి



హైదరాబాద్:రాజధానిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం ప్రచారం చేస్తున్న నేతలు గంపగుత్తగా ఓట్లపై ప్రభావం చూపించే కాలనీ సంఘాల ప్రతినిధులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో బూత్ కమిటీలను బలోపేతం చేసి వారి ద్వారా బూత్‌ల్లో అధిక ఓట్లు పొందేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

4,846 గుర్తింపు పొందిన సంఘాలు..

బల్దియా పరిధిలో సుమారు పదివేల కాలనీలు ఉంటే అందులో 4,846 కాలనీ సంఘాలను అధికారులు గుర్తించారు. కాలనీ అవసరాలను వీరే తీరుస్తుంటారు. ఈ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఓట్లు ఉంటాయన్న ఉద్దేశంతో అభ్యర్థులు వీరితో సమావేశమవుతున్నారు. నాలుగైదు రోజుల కిందట శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కాలనీ సంఘాలతో అక్కడి అభ్యర్థి అరికెపూడి గాంధీ, రాష్ట్ర మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇతర నియోజకవర్గాల్లో కాలనీల్లో సమస్యల పరిష్కారానికి బరిలో ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు హామీలు గుప్పిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో కాలనీ సంఘాలతో సమావేశమై వారికి కొన్ని హామీలు ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థులు యోచిస్తున్నారు.

ఇంటికి వెళ్లి.. ఫోన్‌లో పలకరించి

బూత్ కమిటీల పటిష్ఠతపైనా పార్టీలు దృష్టిపెట్టాయి. సాధారణంగా ప్రతి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఆధారంగా 200 నుంచి 600 వరకు బూత్‌లు ఉన్నాయి. భారాస ప్రతి బూత్‌కు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆరుగురు నుంచి పది మంది వరకు కార్యకర్తలను సభ్యులుగా నియమించారు. వీరు రోజువారీగా సంబంధిత బూత్‌ల్లోని ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రచారం చేయడంతోపాటు పోలింగ్ రోజు అందరినీ కేంద్రానికి తీసుకొచ్చే బాధ్యతను తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో 576 పోలింగ్ బూత్‌లున్నాయి. అక్కడి భారాస అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సగటున ఒక్కో బూత్‌కు ఆరుగురు సభ్యులను నియమించారు. వీరంతా ఇప్పటికే ఇంటింటికి వెళ్లారు. ఓటర్ల ఫోన్ నంబరు సేకరించి తరచూ మాట్లాడుతున్నారు. రాజేంద్రనగర్‌లో భారాస అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ కమిటీ సభ్యులతో ప్రచారం నిర్వహిస్తున్నారు. సనత్‌నగర్ బూత్ కమిటీలతో అక్కడి అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మంత్రి కేటీఆర్ రెండు రోజుల కిందట సమావేశమై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులంతా కమిటీలను నియమించే ప్రక్రియ మొదలు పెట్టారు. రెండు రోజుల్లో పూర్తి చేస్తామని.. భారాసకు దీటుగా ఇవి చేయబోతున్నామని హస్తం నేతలు చెబుతున్నారు. భాజపాకు బూత్ కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలోని ప్రతినిధులతో అభ్యర్థులు మాట్లాడుతున్నారు. వీరి ద్వారానేఇంటింటి ప్రచారం చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం

వేములవాడ : జిల్లాలో పత్తి కొనుగోలుకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో జిల్లాలోని వేములవాడలో రెండు, కోనరావుపేటలో ఒకటి, ఇల్లంతకుంట మండలంలో రెండు, బోయినపల్లిలో ఒకటి చొప్పున మొత్తం ఆరు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లాలో పత్తి సేకరణ మొదలైంది. మొదటి దఫా సేకరించిన పత్తిని రైతులు ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. మరికొంత మంది ఇంటి అవసరాలకు పత్తిని గ్రామాల్లో దళారులకు విక్రయిస్తున్నారు.జిల్లాలో ఈ ఏడాది దాదాపు 54,489 వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు పత్తి పంటను సాగు చేశారు. 3.2 లక్షల క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది సీసీఐ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020లుగా ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాది సీసీఐ మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లో అధిక ధర పలకడంతో రైతులు చాలా వరకు బహిరంగ మార్కెట్లోనే పత్తిని విక్రయించుకొన్నారు. దీంతో సీసీఐ కేంద్రాలు నామమాత్రంగా నడిచాయి. జిన్నింగ్ మిల్లులకు కూడా ఆశించిన మేర పత్తి రాకపోవడంతో చాలా వరకు నామమాత్రంగా నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లో ధర తక్కువ ఉంటేనే సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తిని సేకరించడానికి అవకాశం ఉంది.

ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతూ వస్తోంది. వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పత్తి సాగులో దిగుబడులు అంతగా రాకపోవడంతో పాటు ప్రతికూల పరిస్థితుల కారణంగా ఏటా నష్టపోవడం జరుగుతుంది. దిగుబడి వచ్చినప్పటికీ పత్తికి మద్దతు ధర లభించకపోవడం వంటి పలు కారణాల వల్ల కర్షకులు పత్తి సాగుకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా గత కొన్నాళ్లుగా జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతూ వస్తుంది. 2018–19 ఏడాదిలో 1,26,691 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 54,489 ఎకరాల్లోనే పత్తి పంటను వేశారు. అయిదేళ్లలోనే సగానికి పైగా విస్తీర్ణం తగ్గడం గమనార్హం.

కేంద్రాలను గుర్తించాంజిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం జిల్లాలో ఆరు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు గుర్తించడం జరిగింది. ఇప్పుడిప్పుడే పత్తి దిగుబడులు వస్తున్నాయి. త్వరలోనే కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం.ప్రవీణ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

# 18న రెండో విడత ఈవీఎం యాదృచ్ఛికీకరణ

నిజామాబాద్ : జిల్లాలో శాసన సభ ఎన్నికలకు అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 30న పోలింగ్ ఉండటంతో అధికారులు ఆఘమేఘాలపై ఏర్పాట్లలో మునిగిపోయారు. తుది ఓటరు జాబితా విడుదల చేయగా తాజాగా దానికి అనుబంధ ఓటరు జాబితా ప్రకటించారు. మరోవైపు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించారు. పోలింగ్ నిర్వహణకు అవసరమయ్యే ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం)ల యాదృచ్ఛికీకరణ(ర్యాండమైజేషన్) మొదటి విడత ప్రక్రియ గత నెల 20వ తేదీన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి యంత్రాలను నియోజకవర్గాలకు పంపిణీ చేసి స్ట్రాంగ్ రూంలలో భద్ర పరిచారు. జిల్లాలో ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ గ్రామీణం, బాల్కొండ నియోజకవర్గాల్లో 1.549 పోలింగ్ కేంద్రాలు ఉండగా బ్యాలెట్ యూనిట్లు 1,934, కంట్రోల్ యూనిట్లు 1,934, వీవీ ప్యాట్లు 2,166 కేటాయించారు.

వినియోగంపై అవగాహన

ఈవీఎంల పనితీరుపై ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసి కాలనీల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రజల్లో చైతన్యం తెచ్చారు. కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లతో పాటు వీవీ ప్యాట్ల పనితీరు గురించి వివరించారు. ఓటింగ్ సమయంలో ప్రజలు గందరగోళానికి గురికావొద్దనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా ప్రచారం చేశారు. తద్వారా ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నారు.

రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో..

రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్(యాదృచ్ఛికీకరణ)కు అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. పొరపాట్లకు తావులేకుండా పక్కాగా చేపట్టాలని ఇది వరకే ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. 18న రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో యంత్రాల ర్యాండమైజేషన్ నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ మొత్తం కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తారు. వేసిన నంబర్ల ప్రకారం అవి ఏ పోలింగ్ కేంద్రాలకు వెళ్తాయో అధికారులు పార్టీల ప్రతినిధులకు చూపిస్తారు. ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ర్యాండమైజేషన్ చేపడుతున్నారు. ఇలా కేటాయించిన ఈవీఎంలను పోలింగ్ సిబ్బంది ఓటింగ్‌కు ఒకరోజు ముందు ఈ నెల 29న పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తారు. తరలింపు ప్రక్రియ మొత్తం రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలోనే నిర్వహిస్తారు.

# దూరమెంతైనా.. భారమనుకోం

కామారెడ్డి : రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును అపహాస్యం చేయకుండా సరైన ప్రజాప్రతినిధిని ఎన్నుకోవడం ఓటర్ల బాధ్యత. కొందరు ఓటర్లు మాత్రం పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. వీరికి భిన్నంగా కొందరు ఎంత దూరాన ఉన్నా స్వగ్రామానికి వచ్చి ఓటు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన చాలా మంది ఉద్యోగాలు చేసుకుంటూ ఇతర రాష్ట్రాల్లో, హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. వీరు సొంత డబ్బులతో మూడు నాలుగు రోజుల పాటు ప్రయాణం చేసి ఓటు వేయడానికి స్వగ్రామాలకు వస్తున్నారు. వీరిని చూసైనా పోలింగ్‌శాతాన్ని మరింత పెంచేలా కృషిచేయాల్సిన అవసరం ఉంది.

యువతా ఆలోచించు..

ఉమ్మడి జిల్లాలో 20,67,939 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 50 సంవత్సరాల వయసు వారు 70 శాతం మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇక 18– 29 ఏళ్ల వయసువారు అందులో సగం ఉన్నారు. 18 నుంచి 29 సంవత్సరాల వయసు విభాగంలోనే పోలింగ్‌శాతం తక్కువగా నమోదవుతోంది. వీరు స్థానికంగానే ఉంటున్నా చాలా మంది ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. 80, 90 ఏళ్ల వారు కూడా స్వేచ్ఛగా ఓటు వేస్తున్నారు. వీరి స్ఫూర్తితో యువత ముందుకురావాలి.

900 కి.మీ ప్రయాణం చేస్తా

బోగ నవీన్‌కుమార్, బ్రాహ్మణపల్లి (తాడ్వాయి)

నేను శ్రీకాకుళం జిల్లాలో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిని. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 900 కి.మీ ప్రయాణం చేసి మా స్వగ్రామానికి వచ్చి ఓటు వేస్తాను. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా యువత ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. ఇది మంచిపద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా గొప్పది.

నవంబరు 30న స్వగ్రామానికి..కమ్మరి శేఖర్, ఐలాపూర్(లింగంపేట)

నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. ఉద్యోగ రీత్యా 2014 కంటే ముందు నుంచి ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నాను. మన వద్ద ఎన్నికలు ఎప్పుడున్నా స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటాను. బెంగళూరు నుంచి వచ్చి 2014, 2018 ఎన్నికల్లో ఓటువేశాను. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాను. ఇప్పుడు కూడా నవంబరు 30వ తేదీన స్వగ్రామానికి వచ్చి వేస్తాను.

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి

బెల్లపు సునీల్‌కుమార్, కామారెడ్డి

నేను బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాను. మన రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఇక్కడకు వచ్చి తప్పకుండా ఓటు వేసి వెళ్తాను. ప్రజాస్వామ్యంలో యువత ఓటింగ్‌లో పాల్గొనడం చాలా ముఖ్యం. ప్రజలకు సేవ చేసే మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

ఆనందంగా ఉంటుంది

దేవరగట్టు బాలప్రసాద్, దోమకొండ

నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. గతంలో పుణెలో ఉన్నాను. ప్రస్తుతం హైదరాబాద్‌కు వచ్చాను. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఏ ఎన్నికలు వచ్చినా కచ్చితంగా దోమకొండలో ఓటు వేస్తాను. నా గ్రామంలో ఓటు హక్కు వేయడంతో చాలా ఆనందంగా ఉంటుంది.

సొంతూరికి వచ్చి వేస్తాం

కావేరి బాలయ్య, సదాశివనగర్

మా ఇద్దరు పిల్లలు హైదరాబాద్‌లో ఉంటారు. దీంతో నేను, నా భార్య కలిసి కుమారుల వద్దే ఉంటున్నాం. ఇల్లు, జాగ, రేషన్‌కార్డు, ఓటు హక్కు అన్ని సొంతూరులోనే ఉన్నాయి. దీంతో ఏ ఎన్నికలు వచ్చినా అందరం కలిసి మా సొంతూరిలోనే ఓటు వేసి మళ్లీ హైదరాబాద్‌కు వెళ్తా.

పుణె నుంచి వస్తా

దత్తు, గుండూరు, జుక్కల్

నేను పుణెలోని ఎల్‌జీ కంపెనీలో ఉద్యోగిని. చాలా ఏళ్ల నుంచి అక్కడే విధులు నిర్వహిస్తున్నా. మా వాళ్లు అందరు స్వగ్రామంలో ఉంటారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ నేను స్వగ్రామం వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటాను. పంచాయతీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఇలా ఏ ఎన్నికలకైనా.. ఇక్కడికి వచ్చి ఓటు వేస్తాను.

# కుప్పలుగా బిల్లులు.. ఉద్యోగులకు తిప్పలు!

జనగామ : వివాహాలు, గృహ అవసరాలు, ఆసుపత్రి ఖర్చులు, పదవీ విరమణ పైకం, కార్యాలయాల నిర్వహణ ఖర్చులు....ఇలా పలు రకాల బిల్లులకు ఖజానా కార్యాలయంలో ఆమోదం తెలిపినా నగదు జమ కావడం లేదు. ఈ-కుబేర్ విధానం కారణంగా ఆర్‌బీఐ నుంచి వాటికి అనుమతులు లభించడం లేదు. ఫలితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులకు రావాల్సిన వివిధ రకాల బిల్లులు పేరుకుపోతున్నాయి. హనుమకొండ జిల్లాలో గత రెండు నెలల్లో రూ.19.34 కోట్లకు సంబంధించిన 1080 బిల్లులు పేరుకుపోయాయి. ఒకటో తేదీ రావాల్సిన జీతాలు, పింఛన్లు వారం రోజులు గడిస్తే గానీ చేతికి అందడం లేదు. ఇక ఇతర బిల్లులకు నెలల కాలం పడుతోంది. హనుమకొండ, వరంగల్ తూర్పు, భీమదేవరపల్లిలో ఖజానా శాఖ కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 15,000 మంది ఉద్యోగులు, 16,000 మంది పింఛనుదారులు, మరో 6 వేల మంది ఒప్పంద ఉద్యోగులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సుమారు 1000 మంది హెూంగార్డులు ఉన్నారు. వీరి జీతభత్యాలతో పాటు వారి భవిష్యనిధి, కార్యాలయాల అద్దెలు, వాహన కిరాయిలు, ఫోన్, విద్యుత్తు బిల్లులు, వైద్య ఖర్చులు ఇతర అవసరాల నిమిత్తం పెట్టిన బిల్లులు ఆయా ఖజానా కార్యాలయాలకు వెళ్తాయి. అధికారులు ఎప్పటికప్పుడు ఆమోదం తెలుపుతున్నారు. నగదు మాత్రం వారి ఖాతాల్లో జమ కావడంలేదు. ఖజానా శాఖకు వెళ్లి సంప్రదిస్తే బిల్లులకు




ఆమోదం తెలిపామని, తమ చేతిలో ఏం లేదని చెబుతున్నారు. ఆయా బిల్లులు నగదు రూపంలో ఎప్పుడు చేతికొస్తాయో తెలియని ఆందోళన ఉద్యోగులను వెంటాడుతోంది.

ఈ కుబేర్ అమలుతోనే అవస్థలు

గతంలో బిల్లులకు ఆమోదం తెలుపగానే వాటికి సంబంధించిన నగదు వెంటనే ఖాతాల్లో జమ అయ్యేవి. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో అనుసంధానం అయినప్పటి నుంచి ఈ కుబేర్ విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానంలో ఆర్థిక శాఖ సూచన మేరకు బిల్లులు ఆర్‌బీఐ నేరుగా చెల్లించాలి. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలను బట్టి బిల్లుల చెల్లింపులు ఆధారపడి ఉండటంతో జిల్లా అధికారులు సైతం ఏం చేయలేని పరిస్థితి. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర బిల్లులకు రోజులు, నెలల తరబడి వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు.

ఎప్పటికప్పుడు ఆమోదం తెలుపుతున్నాం- గుజ్జు రాజు, జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు

బిల్లులకు ఎప్పటికప్పుడు ఆమోదం తెలుపుతున్నాం. ఇవి ఈ కుబేర్ విధానంలోకి వెళ్తాయి. అక్కడ నుంచి ఖాతాల్లో జమకావడానికి కాస్త సమయం పడుతుంది. దీనిపై అవగాహన లేక కొందరు మా దగ్గరే ఆలస్యం చేస్తున్నారని అంటున్నారు. ఉద్యోగులు, పింఛనుదారులు ఈ విషయాన్ని గమనించాలి.

# బస్తీ దవాఖానాలొస్తున్నాయి

బోధన్ : ఇందూరు సిగలో మరో మూడు బస్తీ దవాఖానాలు చేరనున్నాయి. తద్వారాఆర్మూర్, బోధన్, నిజామాబాద్‌లో మొత్తం ఎనిమిది అందుబాటులోకి రానున్నాయి. మొదటి విడతలో కేటాయిం చిన అయిదింటిలో మూడు ప్రారంభించారు. మిగతా రెండింటి ఏర్పాటుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. తాజాగా మరో మూడు కేటాయించడంతో వైద్య సేవలు విస్తరించనున్నాయి.

సేవల విస్తరణకు..ఆయుష్మాన్ భారత్‌లో పీహెచ్‌సీ స్థాయి సేవలను విస్తరించడానికి గ్రామాలు, పట్టణాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపాలిటీ భవనం సమకూర్చితే.. వైద్యఆరోగ్య శాఖ ఔషధాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తుంది.

ప్రాథమిక దశలోనే..ప్రజల నివాసాలకు ఆసుపత్రులు దూరంగా ఉండటంతో వారికి సకాలంలో సరైన చికిత్స అందడం లేదు. ప్రాథమిక దశలో వ్యాధి నిర్ధారణ కాక ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. ప్రధానంగా రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటివి ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించాల్సిన అవసరం ఉంది. ఇక పిల్లలకు టీకాలు, గర్భిణులకు సకాలంలో సేవలందిస్తే మాతాశిశు మరణాలు తగ్గుముఖం పడతాయి.

ఆర్మూర్‌కు రెండు..మొదటి విడతలో నిజామాబాద్‌కు 3, బోధన్, ఆర్మూర్‌కు ఒక్కోటి చొప్పున బస్తీ దవాఖానాలు మంజూరు చేశారు. వాటిలో నిజామాబాద్‌లో రెండు, బోధన్‌లో ఒకటి ప్రారంభమయ్యాయి. నగరం, ఆర్మూర్‌లో మిగతా రెండు



సిద్ధమవుతున్నాయి. కాగా ఆర్మూర్‌కు మరో రెండు, బోధన్‌కు ఒకటి చొప్పున మంజూరు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీటికి భవనాలు గుర్తించాలని పురపాలిక అధికారులను కోరారు.

వేధిస్తున్న వైద్యుల కొరత

ప్రారంభించిన మూడు బస్తీ దవాఖానాల్లో ఒక్కచోటనే వైద్యాధికారి పనిచేస్తున్నారు. నగరం, బోధన్‌లోని కేంద్రాల్లో విధుల్లో చేరినవారు ఉద్యోగం మానేశారు. శక్కర్‌నగర్ కాలనీలో స్టాఫ్‌నర్సు అందుబాటులో ఉన్నారని భావించినా.. ఆమె ప్రసూతి సెలవులో వెళ్లడంతో సేవలు ప్రశ్నార్థకమయ్యాయి. ఈ ఆసుపత్రుల్లో పని చేసేందుకు వైద్యులు విముఖత చూపుతున్నారనే ప్రచారం ఉంది. ఒక్కో బస్తీ దవాఖానాలో నిత్యం 30కి పైగా ఓపీ నమోదవుతోంది. నిర్వహించే టీకా శిబిరానికి పది మంది వస్తున్నారు. నెలవారీ పరీక్షలకు 20 మంది గర్భిణులు వస్తుండటం గమనార్హం.

త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తాం- సుదర్శనం, జిల్లా వైద్యాధికారి

ఇప్పటికే నడుస్తున్న వాటిల్లో ఖాళీలు, ప్రారంభానికి సిద్ధమైన వాటికి కలిపి నియామకాలు చేపడుతున్నాం. త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తాం. కొత్తగా మంజూరైన వాటికి స్థలం గుర్తించే ప్రక్రియ నడుస్తోంది.

# పెట్రోలు బంకులు.. కానరాని వసతులు!



నర్సంపేట : 'పెట్రోలు బంకుల్లో కనీస వసతుల్లేక వినియోగదారులు, పనిచేసే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, అగ్నిమాపక నివారణ జాగ్రత్తలు, టెలిఫోను సౌకర్యాలున్నట్లుగా పెట్రోల్ పంపుల్లో బోర్డులు కనిపిస్తాయి. లోపలికెళ్లి పరిశీలిస్తే ఏవీ ఉండవు. ఇంధనం కోసం వచ్చే వాహనదారులు, అక్కడ పనిచేసే సిబ్బంది వసతులపై పెదవి విరుస్తున్నారు. వాహనాల్లో గాలి నింపటం, ఇంజిన్ ఆయిల్ నింపడం వంటివి చాలా చోట్ల లేవు. రాత్రివేళ వాహనాల నిలుపుదలకు ఉన్న స్థలాలు దుమ్ము ధూళితో నిండి ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని పంపుల్లో వసతులు, సమస్యలపై బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. ఇది హంటర్‌రోడ్ సీఎస్సార్ గార్డెన్ కూడలిలో రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పెట్రోల్ పంపు. ఇక్కడ తాగునీటి సమస్య ఉంది. వాటర్ కూలర్ పక్కన పెట్టారు. అగ్ని ప్రమాదాల నివారణ జాగ్రత్తలు, పరికరాలు అందుబాటులో లేవు.ఇది హంటర్‌రోడ్ ఆర్వోబీ పక్కనే ఉన్న బంకు. తాగునీటి వసతి లేదు. టాయిలెట్లు అధ్వానంగా ఉన్నాయి. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల్లేవు. ఎటువంటి జాగ్రత్తలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించలేదు.ఇది సాయినగర్ కాలనీ ఎదురుగా ఉన్న పంపు. టాయిలెట్లు బాగానే ఉన్నా తాగునీటి వసతి సరిగ్గా లేదు. అగ్ని ప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లను అందుబాటులో ఉంచారు. ఇది పోతననగర్ మణీదీప గార్డెన్ పక్కనే ఉన్న పెట్రోల్ పంపు. ఇక్కడ టాయిలెట్లు సరిగ్గా లేవు. తాగునీటి కోసం వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఐవోసీ పెట్రోల్ పంపులో టాయిలెట్లు వెనుక భాగంలో ఉండటంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి కోసం చిన్న ఫ్రీజర్ ఏర్పాటు చేశారు. మినరల్ వాటర్ తెప్పించి నింపుతున్నారు.ఇది నర్సంపేటలో వరంగల్ మార్గంలోని ఓ బంకు. ఒకరు ద్విచక్ర వాహనంలో పెట్రోల్ నింపుతుంటే దానికి చేరువలో అందులో పని చేసేవారు చరవాణి మాట్లాడుతూ కనిపించారు. బంకుల్లో వినియోగదారులు చరవాణి మాట్లాడకుండా నివారించాల్సిన సిబ్బందే పంపు సమీపంలో చరవాణిలో మాట్లాడడం ఆందోళనకరం.ఇది పాకాల మార్గంలో కొత్తగా వెలిసిన బంకు. పంపులపై క్యూఆర్ స్కాన్ బోర్డు ఏర్పాటు చేశారు. నిజానికి బంకులపై కాకుండా వాటిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బంకులపై క్యూఆర్ స్కాన్ కోడ్‌ను చరవాణిలతో స్కాన్ చేసిన సందర్భాల్లో కొన్ని మార్లు ప్రమాదాలు సంభవించే అవకాశముందని నిపుణులు అంటున్నారు .

అపరిశుభ్రంగా.. పోచమ్మమైదాన్ కూడలిలో ఉన్న పెట్రోల్ బంకు ఇది మంచి నీటి వసతి కల్పించినా తాగేందుకు గ్లాసులు లేవు. ఆప్రాంతం అంతా అపరిశుభ్రంగా ఉంది. అగ్ని నిరోధక పరికరాలు అందుబాటులో ఉన్నా సిబ్బందికి ఉపయోగించే విధానం తెలియదంటున్నారు. వాహనాలకు గాలి కొట్టే పరికరం చాలా రోజులుగా వినియోగించడం లేదు.

పనిచేయని ఎయిర్ పంపులు

ఖానాపురం, అశోక్‌నగర్‌లోని పెట్రోల్ బంక్‌ల్లో మరుగుదొడ్డి, తాగునీరు, తదితర వసతులున్నా వాహనదారులకు ఉచితంగా గాలి నింపే పంపులు పనిచేయడం లేదు. వాటి నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బంది లేరు. సిబ్బంది కోసం ఉపయోగపడే మరుగుదొడ్లు, మూత్రశాలలు కన్పించాయే కాని వినియోగదారుల కోసం నిర్మించినవి కన్పించలేదు

నిర్వహణలో మెరుగునర్సంపేట మండలం ముగ్ధంపురం పెట్రోల్ బంకు నిర్వహణ మెరుగ్గానే ఉంది. గతంలో కొన్ని లోటుపాట్లతో సంస్థ ఉన్నతాధికారులు రూ.15వేల జరిమానా విధించిన తర్వాత నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నట్లు బంకు యజమాని తెలిపారు. ఆర్వో వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటుచేశారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, తాగునీరు, మరుగుదొడ్లు, గాలి నింపు సౌకర్యాలున్నాయి.ఇలా ఉండాలి 24 గంటలు పనిచేయాలి నీటి వసతి టెలిఫోను సౌకర్యం అత్యవసర చికిత్స కిట్టు అగ్నిమాపక నివారణ పరికరాలు వాహనాల నిలుపుదల సౌకర్యం గాలి, ఇంజిన్ ఆయిల్ నింపు సౌకర్యం మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా టాయిలెట్లు

# 'వాత్సల్యం' చూపరూ!




వరంగల్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునే అభాగ్యులకు గడువు గండం వచ్చింది. తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, నిరాశ్రయులైన చిన్నారులకు ఆర్థిక చేయూతనందించేందుకు ఈ పథకం ప్రారంభించిన విషయం విధితమే. ఏప్రిల్ 11న అన్ని జిల్లాల సంక్షేమశాఖ అధికారులకు పథకం అమలుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సంబంధిత మార్గదర్శకాలను విడుదల చేసింది. ఏప్రిల్ 16న సంక్షేమ శాఖ అధికారులు జిల్లాలోని అర్హులైన చిన్నారులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించి, ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణకు గడువు విధించారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల్లో ఎక్కడా గడువు ముగిసేవరకు దరఖాస్తు తీసుకోవాలని, గడువు ముగిస్తే.. దరఖాస్తు తీసుకోవద్దని సూచించకున్నా అధికారులు ధరఖాస్తులు తీసుకోకపోవడంతో లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఒక్కో ధ్రువీకరణ మంజూరుకు నెలరోజుల సమయం

తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రం, కుల, ఆదాయ వంటి సుమారు 8 ధ్రువపత్రాలను దరఖాస్తులతో పాటు జతచేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. ఈ ధ్రువీకరణ పత్రాల మంజూరు కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో కనీసం నెలరోజుల సమయం పడుతోంది. తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం మంజూరుకోసం నెలరోజుల పాటు మున్సిపాలిటీల చుట్టూ తిరగాల్సి వస్తోంది. చిన్నారుల జనన ధ్రువీకరణ పత్రానికి దళారులను ఆశ్రయించినా.. దాదాపు 20 రోజుల సమయం పడుతోంది. స్థానిక తహసీల్దార్, మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగినా గడువులోపు చాలామందికి కుల, ఆదాయ తదితర ధ్రువపత్రాలు చేతికందటం లేదు. దరఖాస్తుతో పాటు జాయింట్ అకౌంటు తప్పనిసరికావడంతో కొంతమంది ఆర్థికసమస్యలతో ఖాతా తెరవలేకపోయారు. ఈ పథకానికి గడువు తేదీని పెంచాలని బాదితులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ ఉపాధ్యాయుల అవగాహన లోపం

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకునే వారు స్థానిక అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాల్సిందిగా అధికారులు సూచించారు. అంగన్‌వాడీల్లోని ఉపాధ్యాయులకు పథకంపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో లబ్ధిదారులకు స్పష్టమైన సమాచారం అందించలేకపోయారు. చాలావరకు పథకంపై ప్రచారం చేయకపోవడంతో చివరి క్షణంలో తెలిసిన వారు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను సమర్పించేందుకు ఇబ్బందులు పడ్డారు. లబ్ధిదారులు ఏప్రిల్ 30 లోపే స్థానిక అంగన్‌వాడీల్లో దరఖాస్తులు సమర్పించినా.. టీచర్లు సీడీపీవోలకు దరఖాస్తులను అందజేయడంలో జాప్యం చేయడంతో జిల్లావ్యాప్తంగా వందల్లో దరఖాస్తులను తిరస్కస్తున్నారు.

సల్ల వాణి, వసంతపూర్, ఖిలావరంగల్

ఏడాది కిత్రం నా భర్త మృతిచెందారు. ఓ ప్రైవేటు హాస్టల్‌లో పనిచేస్తూ.. ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాను. మిషన్ వాత్సల్య పథకం గురించి తెలుసుకుని అన్ని ధ్రువీకరణ పత్రాలతో ఏప్రిల్ 30న స్థానిక అంగన్‌వాడీలో దరఖాస్తు చేశాను. గడువు ముగిసిందని ఉన్నతాధికారులు దరఖాస్తును స్వీకరించడం లేదని అంగన్‌వాడీ టీచర్ చెప్పారు. అర్హులైన అందరి చిన్నారుల దరఖాస్తులు స్వీకరించాలి.

నిబంధనల మేరకు గడువు విధించాం-ఎం.శారద, జిల్లా సంక్షేమశాఖ అధికారి

ప్రభుత్వం జారీచేసిన నిబంధనల మేరకే గడువు విధించాం. గడువులోపు వచ్చిన దరఖాస్తులను మాత్రమే స్వీకరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించా. గడువు ముగిసినా వరంగల్ బాలరక్షా భవన్‌లో వివిధ కారణాలతో ఆలస్యమైన దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. నేరుగా లబ్ధిదారులు దరఖాస్తులను బాలరక్ష భవన్‌లో సమర్పించొచ్చు.

# తొలిమెట్టు స్ఫూర్తితో లిప్

నిజామాబాద్ : సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టమ్, సేవ్ ది చిల్డ్రన్ సంస్థ సహకారంతో విద్యాశాఖ గత మార్చి 9-16 మధ్య.. అక్షర ప్రగతి పేరిట 6-9 తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే చేసింది. తెలుగు, ఆంగ్లంతో పాటు కూడికలు, తీసివేతలు చేయడం లేదని గుర్తించింది. ఈ లోపాలను సరిదిద్దేందుకు గాను లిప్ అమలుకు విద్యాశాఖ ముందుకొచ్చింది.శిక్షణకు సన్నాహాలు ప్రాథమిక స్థాయిలో కనీస అభ్యసన సామర్థ్యాల పెంపు కోసం ప్రభుత్వం గతేడాది తొలిమెట్టు తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం సత్ఫలితాలివ్వడంతో రానున్న విద్యా సంవత్సరంలో 6 నుంచి 9 తరగతులకు విస్తరించాలని సంకల్పించింది. ఇందుకు లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కనీస సామర్థ్యాల పెంపు, విద్యాభివృద్ధి దీని ప్రధాన లక్ష్యం. ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి తర్ఫీదు పూర్తయింది. రిసోర్సు పర్సన్లతో జిల్లాల్లోనూ ఉపాధ్యాయులకు శిక్షణ అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఇలా చేస్తారు..పాఠ్యాంశాలను విద్యార్థులు ధారాళంగా చదివేలా ప్రోత్సహించడం, మాతృభాషతో పాటు ద్వితీయ, తృతీయ భాషలను స్పష్టంగా, ఉచ్చరణ దోషాలు లేకుండా రాయగలిగేలా మార్గదర్శనం చేస్తారు. అభ్యసన పద్ధతులతో లాంగ్వేజీలపై పట్టు సాధించేలా బోధన కొనసాగనుంది. రసాయన, భౌతిక, జీవశాస్త్రం తదితర సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు తొలిమెట్టు తరహాలోనే నెలవారీ.. సమీక్షలు, మధ్యంతర, వార్షిక పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను నిశితంగా పరిశీలించి అంచనా వేస్తారు.విషయం వారీగా చర్చించి బోధనోపకరణాలతో అవగాహన కల్పిస్తారు.

# మన చెంతనే.. కార్పొరేట్ వైద్యం!

జయశంకర్ : ఇదివరకు జిల్లాలో సరైన వైద్యం లేక ఇబ్బందులు ఎదురయ్యేవి.. అనారోగ్య సమస్యలు, ప్రసవాలకు కూడా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది.. లేదంటే ప్రైవేటు ఆసుపత్రులే దిక్కు.. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రి(జిల్లా ఆసుపత్రి) ప్రారంభమవడంతో వైద్య సేవలు మెరుగయ్యాయి. మొదటగా మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)తో మొదలై తర్వాత వివిధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. రక్తనిధి కేంద్రం(బ్లడ్ బ్యాంక్), వయోవృద్ధులకు ఉపశమన కేంద్రాలను(పాలేటివ్ కేర్ యూనిట్), నవజాత శిశువులకు ప్రత్యేక కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయూ), జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ), తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్ట్రిక్ హబ్(టీ హబ్) తదితర సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రానున్నాయి.

57 రకాల పరీక్షలు..వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం ఇదివరకు ములుగు, వరంగల్‌కు వెళ్లాల్సి వచ్చేది. కానీ జిల్లా ఆసుపత్రి సమీపంలోనే తెలంగాణ డయాగ్నోస్టిక్ డిస్టిక్ హబ్(టీ హబ్)ను ప్రారంభించారు. ఇందులో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలను తీసుకొచ్చారు. మామోగ్రామ్, ఎక్స్ రే, మైక్రో బయోలజీ, బయోకెమిస్ట్రీ, అల్ట్రా సౌండ్, ఈసీజీ, 2డీ ఎకో, తదితర 57 రకాల పరీక్షలను నిర్వహిస్తారు.

పుట్టుకతో లోపాలుంటే..పుట్టుకతో లోపాలున్నా, పుట్టిన తర్వాత సమస్యలున్నా వాటిని ముందస్తుగా గుర్తించి తగిన వైద్యం అందేలా జిల్లా ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డీఈఐసీ) కృషి చేస్తుంది. పుట్టుకతో



గ్రహణ మొర్రి, కాళ్లు చేతులు వంకర్లు తిరగడం, గుండెకు రంధ్రం పడటం, కంటి, చెవి, తదితర 30 సమస్యలతో బాధపడే 0-18 సంవత్సరాలలోపు పిల్లలకు ఈ కేంద్రంలో సేవలు అందుతాయి. అవసరమైన శస్త్రచికిత్సలు, ఉత్తమ వైద్యం నిమిత్తం పెద్దాసుపత్రులకు సిఫారసు చేస్తారు. ఈ కేంద్రం కోసం 12 మంది వైద్య సిబ్బందిని నియమించారు. కావల్సిన వైద్య పరికరాలు రావాల్సి ఉంది. త్వరలోనే ఈ కేంద్రలో సేవలు ప్రారంభిస్తారు.

నవజాత శిశువులకు

నవజాత శిశువుల కోసం స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయూ)ను అందుబాటులోకి తేనున్నారు. నవజాత శిశువులకు ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే ఎస్ఎన్‌సీయూ యూనిట్లో అడ్మిట్ చేస్తారు. ఇంక్యుబేటర్ లాంటి అత్యాధునిక వైద్య పరికరాలు ఉంటాయి. సుదూర ప్రాంతలకు వెళ్లకుండా సేవలు అందుతాయి. 0-28 రోజుల్లోపు పిల్లలకు ఈ యూనిట్ ఉపయోగపడుతుంది. జిల్లా ఆసుపత్రిలో రెండో అంతస్తులో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. సివిల్ పనులు పూర్తయ్యాయి. వైద్య సిబ్బందిని నియమించారు. త్వరలోనే ఈ యూనిట్ అందుబాటులోకి రానుంది.

ఉపశమన కేంద్రం..వయోభారంతో దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్నవారు.. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారికి ఉపశమన వైద్య సేవలు అందించేందుకు పాలియేటీవ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. కిడ్నీలు చెడిపోయిన వారు, పక్షవాతం, ఇతర దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఇబ్బందులు చికిత్సలు అందిస్తారు. ఫిజియోథెరపి, వ్యాయామం, తదితర వాటికోసం పరికరాలు అందుబాటులో ఉంటాయి. రోగులకు ప్రత్యేక వాహన సదుపాయం కల్పిస్తారు. ప్రత్యేక ప్రోగ్రామ్ అధికారి పర్యవేక్షణలో సేవలు అందుతున్నాయి. అవసరమైన కొన్ని పరికరాలు రావాల్సి ఉంది.

వివిధ రకాల సేవలు..జిల్లా ఆసుపత్రిలో ఇదివరకే సాధారణ ఓపీ విభాగం, మాతాశిశు కేంద్రం, రక్తనిధి కేంద్రం, ఆరోగ్య మహిళా వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. నూతనంగా కొన్ని, త్వరలోనే మరిన్ని వైద్య సేవలు, వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఇవన్నీ ఒకే ప్రాంగణంలోనే ఉంటాయి. అలాగే మరో మూడు నెలల్లో వైద్య కళాశాల కూడా ప్రారంభం కానుంది.

అన్ని రకాల సేవలు అందుతాయిడాక్టర్ తిరుపతి, డీసీహెచ్ఎస్, భూపాలపల్లిజిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతాయి. ఇప్పటికే ప్రసవాలు జరుగుతున్నాయి. వివిధ రోగాలతో వచ్చే వారికి ఓపీ ఉంటోంది. వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. పాలియేటివ్, డీఈఐసీ కేంద్రాలతో అదనపు ప్రయోజనం ఉంటుంది. నవజాత శిశువులకు ప్రత్యేక కేర్ యూనిట్(ఎస్ఎన్‌సీయూ) త్వరలో ప్రారంభిస్తాం.

# చరిత ఘనత చాటుతా..

నిజామాబాద్ : ఇందూరు ఉత్సవాల సందర్భంగా సందర్భంగా 2001లో అప్పటి పాలనాధికారి అశోక్‌కుమార్ తిలక్‌గార్డెన్‌లోని టౌన్‌హాల్‌లో నన్ను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల్లోని శిల్పాలు, శిలాశాసనాలు, విశేష ప్రాచుర్యం పొందిన తాళపత్ర గ్రంథాలు, నాణేలు సేకరించి ఒక్కచోటకు చేర్చారు. వారంలో ఒకరోజు ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా తిలకించే అవకాశం కల్పించారు. పర్యాటక కేంద్రంగా ప్రాచుర్యం కల్పించారు. బుడిబుడి నడకలతో వచ్చే చిన్నారులను చూసి నేను పరవశించిపోయా..

నాడు మరమ్మతుల పేరిట..పురాతన భవనంలో నన్ను ఏర్పాటు చేయడంతో వర్షాకాలంలో పైకప్పు ఉరవడం వల్ల వాననీటితో అపురూప గ్రంథాలు, ఆభరణాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడటంతో 2012 - 14 మధ్య మూసి ఉంచారు. ఈ సమస్యపైలో వరుస కథనాలు రావడంతో స్పందించిన రాష్ట్ర ఉన్నతాధికారులు మరమ్మతుల కోసం చర్యలు చేపట్టారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో పునర్ధురణ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. తర్వాత సుమారు రూ.40 లక్షలతో దంగుసున్నం, రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు.

అల్మారాలు అన్నారు..వస్తువుల ప్రదర్శన కోసం కొత్త అల్మారాలు తెస్తామన్నారు. ఇందుకు టెండర్లు స్వాగతించామంటూ చెబుతూ వచ్చారు. కరీంనగర్ జోన్ సహాయ సంచాలకులు సాగర్ వచ్చి నా దీనస్థితిని చూసి చలించారు. త్వరలో అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. పూర్తిస్థాయి సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు వచ్చివెళ్లారు. తర్వాత గత కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. సహాయ సంచాలకులను తన కార్యాలయానికి పిలిపించుకొని మాట్లాడారు. ఆలస్యం చేయకుండా నన్ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించినా.. ఇప్పటి వరకు అతీగతీ లేదు.కరెంటు తొలగించారు..విద్యుత్తు బిల్లులు చెల్లించకపోవడంతో ఆరు నెలల క్రితం కనెక్షన్ తొలగించారు.



# చాముండేశ్వరి అమ్మవారికీ 'గృహలక్ష్మి'.. నెలకు రూ.2 వేలు జమ..!

బెంగళూరు: కర్ణాటకలో మహిళల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'గృహలక్ష్మి' పథకం లబ్ధిదారుల జాబితాలో సాక్షాత్తూ మైసూరు చాముండేశ్వరి అమ్మవారు కూడా ఉండనున్నారు. మహిళా శక్తికి ప్రతీక అయిన చాముండేశ్వరి దేవికి కూడా నెలకు రూ.2వేల చొప్పున ఇవ్వనున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ, పార్టీ మీడియా విభాగం ఉపాధ్యక్షుడు దినేశ్ గోలిగౌడ శుక్రవారం వెల్లడించారు. 'గృహలక్ష్మి' పథకం కింద అమ్మవారికి కూడా నెల నెలా డబ్బులు ఇవ్వాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు తాను లేఖ రాసినట్లు దినేశ్ పేర్కొన్నారు. "నా లేఖకు డిప్యూటీ సీఎం తక్షణమే స్పందించారు. ప్రతి నెలా చాముండేశ్వరి దేవి ఆలయ బ్యాంకు ఖాతాకు రూ.2వేలు జమ చేయాలని మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌ను ఆదేశించారు" అని ఎమ్మెల్సీ దినేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల గ్యారంటీల్లో ఒకటైన 'గృహలక్ష్మి' పథకాన్ని కర్ణాటక సర్కారు ఈ ఏడాది ఆగస్టు 30న ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద అర్హులైన మహిళలకు నెల నెలా రూ.2వేల చొప్పున జమ చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పైనే లబ్ధిదారులకు ఈ పథకాన్ని అందిస్తున్నారు. కాగా.. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఈ 'గ్యారంటీ'కి విశేష స్పందన లభించడంతో తాజాగా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ హస్తం పార్టీ ఇదే గ్యారంటీని తమ ప్రచారాస్త్రంగా మలుచుకుంది. వచ్చేఏడాది జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 'గృహలక్ష్మి'ని అమలు చేస్తామని ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు.



# డీప్‌ఫేక్ ఆందోళనకరం

దిల్లీ: ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న డీప్‌ఫేక్ ఫొటోలు, వీడియోలు సినీతారలు, సెలబ్రిటీలను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. కృత్రిమ మేధను దుర్వినియోగం చేసి ఇలా డీప్‌ఫేక్ వీడియోలు సృష్టించడం సమస్యాత్మకం, పెను ఆందోళనకరమని అన్నారు. దిల్లీలోని భాజపా కేంద్ర కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని దీనిపై స్పందించారు. "డీప్‌ఫేక్ వీడియోలు మన వ్యవస్థకు పెనుముప్పుగా మారుతున్నాయి. ఇవి సమాజంలో గందరగోళానికి కారణమవుతున్నాయి. ఇటీవల నేను పాట పాడినట్లుగా ఓ వీడియో వైరల్ అయ్యింది. తెలిసినవాళ్లు కొందరు దాన్ని నాకు ఫార్వర్డ్ చేశారు. ఈ డీప్‌ఫేక్ వీడియోలపై మీడియా, జర్నలిస్టులు.. ప్రజలకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలి. అభివృద్ధి చెందుతున్న సాంకేతికత వల్ల ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, వాటి నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలన్న దానిపై అవగాహన కల్పించాలి" అని మోదీ వ్యాఖ్యానించారు. ఇలాంటి వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ అయినప్పుడు వాటిని ఫ్లాగ్ చేసి, వార్నింగ్ ఇవ్వాలని చాట్‌జీపీటీ (%జష్ట్రఝ-ఊ%) బృందాన్ని తాను కోరినట్లు ప్రధాని ఈ సందర్భంగా వెల్లడించారు. ఇటీవల నటి రష్మికకు చెందిన ఓ డీప్‌ఫేక్ వీడియో దుమారం రేపిన విషయం తెలిసిందే. ఆ తర్వాత బాలీవుడ్ నటీమణులు కత్రినా కైఫ్, కాజోల్ కూడా ఈ డీప్‌ఫేక్ బారినపడ్డారు. దీంతో ఈ వీడియోలపై నెటిజన్లు, సినీతారలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల కేంద్రం దీనిపై స్పందిస్తూ.. మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలపై ఎక్స్(ట్విటర్), ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్ తదితర సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేసింది. మార్ఫింగ్ ఫొటోలపై ఫిర్యాదు అందిన 36 గంటల్లోపు వాటిని తొలగించాలని సామాజిక మాధ్యమాలను కేంద్రం ఆదేశించింది. నిబంధనలు పాటించని సంస్థలపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వశాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపింది. ఎవరైనా, ఏదైనా కమ్యూనికేషన్ పరికరం లేదా కంప్యూటర్ రిసోర్స్ వినియోగించి వ్యక్తులను మోసం చేస్తే మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా పడుతుందని హెచ్చరించింది.



# యెమెన్‌లో కేరళ నర్సుకు 'మరణశిక్ష'పై లభించని ఊరట..!

యెమెన్‌లో ఓ హత్య కేసులో మరణ శిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియకు అక్కడి సుప్రీంకోర్టులోనూ ఊరట లభించలేదు. మరణ శిక్షను సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన అప్పీల్‌ను యెమెన్ సుప్రీంకోర్టు తిరస్కరించింది. దీంతో ఆమె మరణశిక్ష అమలు తప్పేలా కన్పించట్లేదు. మరోవైపు తన కుమార్తెను కాపాడుకునేందుకు యెమెన్ వెళ్లేందుకు అనుమతినివ్వాలని ప్రియ తల్లి దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై వారంలోగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశించింది.

**అసలేంటీ నర్సు కేసు..** కేరళకు చెందిన నర్సు నిమిష ప్రియ కుటుంబం కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం యెమెన్ వెళ్లింది. 2014లో ఆమె భర్త, కుమార్తె భారత్‌కు తిరిగి రాగా.. ఆమె మాత్రం ఉద్యోగ రీత్యా అక్కడే ఉండిపోయింది. 2015లో యెమెన్ దేశస్థుడైన తలాల్ మహ్దీ సాయంతో అక్కడే ఓ క్లినిక్‌ను ప్రారంభించింది. అయితే, కొద్ది రోజులకే వీరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ప్రియ పాస్‌పోర్ట్‌ను లాగేసుకున్న మహ్దీ.. ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. దీంతో అతడి నుంచి ఎలాగైనా పాస్‌పోర్ట్‌ను తీసుకుని స్వదేశానికి రావాలనుకున్న ప్రియ.. 2017 జులైలో మహ్దీకి మత్తు ఇంజెక్షన్ ఇచ్చింది. అయితే, అది కాస్తా ఓవర్‌డోస్ అవడంతో మహ్దీ అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. మహ్దీ మృతిచెందడంతో భయాందోళనకు గురైన ఆమె.. మరో వ్యక్తితో కలిసి మృతదేహాన్ని మాయం చేసింది. నాలుగు రోజుల తర్వాత వారి నేరం బయటపడటంతో పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన యెమెన్ కోర్టు.. ప్రియకు మరణశిక్ష విధిస్తూ తీర్పు నిచ్చింది.

**భారత్‌లో తల్లి పోరాటం..** కుమార్తె మరణశిక్ష గురించి తెలియగానే ప్రియ తల్లి యెమెన్ వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, యెమెన్‌లో అంతర్యుద్ధ పరిస్థితుల కారణంగా ఆ దేశానికి రాకపోకలపై భారత్ 2016లోనే నిషేధం విధించింది.

దీంతో అక్కడి వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ప్రియ తల్లి దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెను విడిపించుకునేందుకు యెమెన్ వెళ్లేందుకు అనుమతినివ్వాలని అభ్యర్థించారు. ఆమె పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు తాజాగా మరోసారి విచారణ జరిపింది. అయితే, మరణశిక్షపై ప్రియ దాఖలు చేసిన అప్పీల్‌ను నవంబరు 13న యెమెన్ సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు కేంద్రం తరఫు న్యాయవాది విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. దీంతో ప్రియ తల్లిని యెమెన్ పంపించే అంశంపై వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని దిల్లీ హైకోర్టు.. కేంద్రాన్ని ఆదేశించింది.

# ఏపీని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశాడు



ప్రకాశం: మోదీ ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..."కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాలు ఆంధ్ర రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించారు. ఆంధ్రప్రదేశ్‌ని సీఎం జగన్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చాడు. 1956 నుంచి 2014 వరకు 16 మంది ముఖ్యమంత్రుల కాలంలో ఆంధ్రప్రదేశ్ అప్పు లక్ష కోట్లు ఉంది. జగన్ నాలుగేళ్లలో ఏడున్నర లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడు. ఆఫ్ఘనిస్తాన్ తాలిబన్ల పాలనకు మించినట్లుగా జగన్ పాలన ఉంది. జగన్ పాలనలో రాష్ట్రం రౌడీ రాజ్యం అయ్యింది. ఎర్రచందనం, ఇసుక, మద్యం, ల్యాండ్ మాఫియాగా రాష్ట్రం తయారైంది. నవరత్నాలు నకిలీ రత్నాలుగా మారాయి. మాట తప్పడం మడమ తిప్పడం జగన్ దినచర్యగా మారింది" అని తులసిరెడ్డి ఎద్దేవ చేశారు.



# 5 ఏళ్లలో 3 వేల కొత్త రైళ్లు

## పెట్టెల కూర్పులో మార్పు లేదు - ఎల్‌హెచ్‌బీ రైళ్లలో స్లీపర్ కోచ్‌లు 6-7 మాత్రమే: వైష్ణవ్

దిల్లీ: రాబోయే అయిదేళ్ల కాలంలో 3,000 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రణాళికపై కసరత్తు చేస్తున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రస్తుతం ఏటా రైళ్లలో 800 కోట్ల మంది ప్రయాణిస్తున్నారని, ఈ సామర్థ్యాన్ని 1,000 కోట్లకు పెంచడానికి తగ్గట్టుగా నూతన రైళ్లను సమకూర్చుకోనున్నట్లు చెప్పారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం రైల్వేవద్ద 69,000 కొత్త కోచ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏటా సుమారు 5,000 కోచ్‌లు అదనంగా ఉత్పత్తి అవుతున్నాయి. వీటిద్వారా 200-250 కొత్త రైళ్లను ఏటా పెంచగలుగుతున్నారు. మరింతగా కొత్త రైళ్లను సిద్ధం చేయడంతోపాటు రైళ్ల వేగాన్ని, రైల్వే వ్యవస్థను మెరుగుపరచడం తమ లక్ష్యమని వైష్ణవ్ చెప్పారు. మలుపుల వద్ద, జాగ్రత్తలు తీసుకోవాల్సినచోట రైళ్లు నెమ్మదించి, మళ్లీ వేగం అందుకునేందుకు ప్రస్తుతం తీసుకుంటున్న సమయాన్ని తగ్గించాల్సి ఉందన్నారు. ఈ సమయం పరంగా వందేభారత్‌లు ఇతర రైళ్లకంటే నాలుగురెట్లు మెరుగని చెప్పారు. అన్ని పెట్టెల్లో పుష్-పుల్ విధానాన్ని ప్రవేశపెట్టి, ప్రయాణ సమయం తగ్గేలా చూస్తామన్నారు. రైలుకు వేర్వేరు కోచ్‌లు ఉండే బదులు 22 పెట్టెలను కలిపి ఒక 'ట్రైన్‌సెట్' ఏర్పాటు చేస్తే అనేక ప్రయోజనాలుంటాయని, దానికిగానూ కర్మాగారాల నుంచి రైలు పెట్టెల బదులు రైళ్లనే ఉత్పత్తి చేస్తామని వెల్లడించారు. స్లీపర్‌పెట్టెలను తగ్గించి, ఏసీ కోచ్‌లను పెంచుతున్నామన్న వాదనను మంత్రి తోసిపుచ్చారు. ఎల్‌హెచ్‌బీ పెట్టెల రైళ్లలో సాధారణంగా 6-7 స్లీపర్ కోచ్‌లు, ఆరు థర్డ్‌ఏసీ, రెండు సెకెండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ, నాలుగు జనరల్ కోచ్‌లు ఉంటాయని, ఈ సాధారణ కూర్పులో మార్పులు చేయలేదని స్పష్టంచేశారు.



# విశాఖలో భారత్-ఆసీస్ మ్యాచ్.. టికెట్ల కోసం ఎగబడిన యువత

విశాఖ: భారత్-ఆస్ట్రేలియా మధ్య విశాఖ వేదికగా జరగనున్న టీ20 మ్యాచ్‌కు ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయం ప్రారంభమైంది. ఈనెల 23న నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్ల విక్రయం పూర్తి కాగా.. నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో అమ్ముతున్నారు. టికెట్ల కోసం కౌంటర్ల వద్ద యువత ఎగబడ్డారు. మధురవాడలోని క్రికెట్ స్టేడియంతో పాటు మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని ఇండోర్ స్టేడియంలో టికెట్లను విక్రయిస్తున్నారు. రూ.600, 1,500, 2,000, 3,000, 5,000 ధరల్లో టికెట్లను అందుబాటులో ఉంచారు. టికెట్లను కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున యువత అక్కడికి చేరుకున్నారు. దీంతో సందడి వాతావరణం నెలకొంది. త్వరితగతిన టికెట్లు దక్కించుకునేందుకు కొందరు యువకులు గురువారం రాత్రి స్టేడియాల వద్దే నిద్రపోయారు. మహిళలు సైతం శుక్రవారం వేకువజాము నుంచే క్యూలైన్లలోకి చేరుకుని టికెట్లకు పోటీపడ్డారు.



# అల్-షిఫా ఆస్పత్రి కింద హమాస్ సొరంగం..!

గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అయిన అల్-షిఫా కింద సొరంగాన్ని కనుగొన్నట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ ప్రకటించింది. దీనికి సబంధించిన ఫొటోలు, వీడియోలను శుక్రవారం విడుదల చేసింది. "ఆస్పత్రిలోని హమాస్ సొరంగం నెట్‌వర్క్‌ను గుర్తించాం" అని ఇజ్రాయెల్ సైన్యం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ దేశ ప్రత్యేక దళాలు బుధవారం తెల్లవారుజామున తొలిసారి అల్-షిఫా ఆస్పత్రిలో తనిఖీలు చేపట్టాయి. ఆ తర్వాత ఎమ్మారై గదిలో భారీగా ఆయుధాలను గుర్తించాయి. అనంతరం నేడు సొరంగాన్ని కనుగొన్నారు. ఈ సొరంగం మూతను హమాస్ దళాలు కాంక్రీట్‌తో సీల్ చేసినట్లు ఉంది. దీనిలోకి వెళ్తున్న పైపులు, కేబుల్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు అక్కడ ఆయుధాలు దాచిన ప్రాంతంలో పేలుడు పదార్థాలతో ఓ ఉచ్చును అమర్చిన కారును అడ్డంపెట్టినట్లు తాము గుర్తించామన్నారు. ఇక తమ ఇంజినీర్లు టన్నెల్ నెట్‌వర్క్‌ను బయటపెట్టడానికి తీవ్రంగా యత్నిస్తున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు.

**బందీలను అల్-షిఫాలో ఉంచినట్లు ఆధారాలున్నాయి :** ఇజ్రాయెల్ నుంచి కిడ్నాప్ చేసిన బందీలను అల్-షిఫా ఆస్పత్రిలో ఉంచినట్లు తమ వద్ద బలమైన సంకేతాలున్నాయని ఆ దేశా ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. తమ సైన్యం దానిపై ఆపరేషన్ మొదలుపెట్టడంతో ప్రస్తుతానికి వారిని అక్కడి నుంచి వేరే స్థావరానికి తరలించారని పేర్కొన్నారు. కొన్ని రోజుల కిందటి వరకూ హమాస్ అక్కడ కార్యకలాపాలను నిర్వహించిందన్నారు. ఆ వైద్యశాలలోకి తమ దళాలు అడుగుపెట్టడానికి అదే ప్రధాన కారణమని తెలిపారు. బందీలకు సంబంధించి తమ ప్రభుత్వం వద్ద కీలకమైన ఇంటెలిజెన్స్ ఉందని.. ఆ వివరాలను తాము బహిర్గతం చేయలేమని పేర్కొన్నారు. తమ బలగాలు ఆస్పత్రిలో కచ్చితమైన లక్ష్యాలపైనే దాడులు చేస్తున్నాయని అన్నారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై నెతన్యాహు స్పందిస్తూ గ్రౌండ్ ఆపరేషన్ విజయవంతంగా కొనసాగుతోందని.. హమాస్ కాల్పుల విరమణ ప్రకటించేలా ఒత్తిడి పెంచుతున్నామని వెల్లడించారు. హమాస్ మొత్తం బందీలను విడుదల చేస్తేగానీ.. తాము పాలస్తీనా బందీలను విడుదల చేస్తామన్న ప్రచారంపై మాత్రం నెతన్యాహు ఏమీ మాట్లాడలేదు. కేవలం 'రహస్యం' అని మాత్రమే చెప్పారు. పాలస్తీనాలో నాయకత్వ మార్పు అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. "పాలస్తీనీయులు వారిని వారు పాలించుకొనే అధికారం ఉంది. కానీ, ఇజ్రాయెలీలను భయపెట్టే అధికారం మాత్రం లేదు. అంటే గాజాను నిస్సైనికీకరణ చేయడంతోపాటు.. డీర్యాడికలైజ్ చేస్తాం" అని నెతన్యాహు స్పష్టం చేశారు.

# మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



కృష్ణా: నాగులచవితి సందర్భంగా మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే భక్తులు క్యూ లైన్లలో వేచి ఉన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తొలి పూజ చేసి పుట్టలో పాలు పోశారు. నాగుల చవితి సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు అన్నింటినీ ఆలయ సిబ్బంది రద్దు చేశారు. కేవలం సర్వ దర్శనానికి మాత్రమే అనుమతిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి తరలివస్తున్నారు.

# ధూళిపాళ్ల నరేంద్ర పై హత్యాయత్నం కేసు

గుంటూరు : పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర పై హత్యాయత్నం కేసు నమోదైంది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం వాసి ముసునూరి రాము ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 15వ తేదీన సంగం డెయిరీ వద్ద తమపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. పాల విక్రయానికి సంబంధించి బోనస్ 14 శాతం ఇవ్వలేదని రాము ఆందోళన వ్యక్తం చేశాడు.

డెయిరీ వద్దకు మాట్లాడదామని పిలిచి దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దాడిలో తమ మూడు కార్లు ధ్వంసం అయ్యాయని ఫిర్యాదు చేశారు. కర్రలు, హాకీ స్టిక్స్‌తో దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రాము ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ధూళిపాళ్ల నరేంద్రను 14 వ



నిందితునిగా ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు.

# ఛాన్సులివ్వలేదని లబోదిబో మంటోన్న హీరోయిన్!

సుశాంత్ సింగ్ రాజ్ పుత్ మరణంతో ప్రేయసి రియా చక్రవర్తి చిక్కుల్లో పడిన సంగతి తెలిసిందే. ఆత్మహత్య..హత్యా? అన్న కోణంలో సాగిన విచారణ నేపథ్యంలో రియా జైలు జీవితం గడపడం..అటుపై బెయిల్ పై రావడం వంటి సన్నివేశాలు ఆమె కెరీర్ పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఓ వైపు తానేతప్పు చేయలేని మొర పెట్టుకున్నా! వినే పరిస్థితి కనిపించలేదు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ మానసిక కృంగిబా టుకు గురిచేసింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. ట్రోలింగ్ కూడా తగ్గింది. తాజాగా ఈ పరిస్థితిని ఉద్దేశించి రియా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నా పై వచ్చిన విమర్శలు..ఆరోపణల సమయంలో నా కుటుంబం..స్నేహితులు అండగా నిలబడ్డారు. కానీ ఇప్పుడు బాలీవుడ్ లో



అవకాశాలు ఇవ్వడం లేదు. నాతో సినిమాలు చేసేందుకు భయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం జీవితంలో ఇదే మొదటిసారి' అని వాపోయింది. దీంతో రియా చక్రవర్తి వృత్తిగత జీవితం డైలమాలో పడినట్లు కనిపిస్తుంది. కేసు నుంచి తాను ఇంకా అనుమా నితురాలిగానే ఉంది. నిర్దోషిగా నిరూపించుకుని వస్తే తప్ప అవకాశాలి వ్వడం కష్టం. మరి ఈ ఫేజ్ ని ఎలా దాటుతుంది? అన్నది చూడాలి. ఇలాంటి పరిస్థితుల్లో రియా హిందీ అవకాశాలకన్నా ఇతర భాషల్లో ప్రయత్నాలు చేస్తే కొత్త అవకాశాలకు ఛాన్స్ ఉండొచ్చు. అయితే బాలీవుడ్ తరహాలో దక్షిణాది పరిశ్రమలో అమ్మడికి అవకాశాలు అంత సులభం కాదు. వివాదాస్పద నటీమణుల్ని సౌత్ ఇండస్ట్రీ అందరికంటే ముందే పక్కనబెడుతుంది. శ్వేతాబసు ప్రసాద్ పార్క్ హయత్ సన్నివేశం తర్వాత టాలీవుడ్ కి ఎలా దూరమైందో తెలిసిందే. ఆ సమయలో శ్వేతని ఆదుకుంది బాలీవుడ్ పరిశ్రమే. ఓ పేరున్న దర్శకుడు అమ్మడికి అవకాశాలిచ్చి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. ఆ తర్వాత శ్వేత బసు సౌత్ ఇండస్ట్రీ వైపు చూసింది లేదు.

## కేథరిన్ కవ్వింపులు అందుకోసమేనా..?

హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ప్రతి హీరోయిన్ స్టార్ గా ఎదగాలనే అనుకుంటుంది కానీ వారు ఎంచుకున్న కథలు చేసిన సినిమాలు వారి కెరీర్ ని డిసైడ్ చేస్తాయి. ఎంత గొప్ప అందగత్తె అయినా సరే సరైన కథ సరైన సినిమా ఎంపిక లేకుంటే కెరీర్ ముందుకు సాగించే అవకాశం ఉండదు. అలాంటి వారిలో చెప్పుకుంటే కేథరిన్ త్రెసా ఉంటుంది. చూస్తే స్టార్ హీరోయిన్ ఫీచర్స్ ఉన్నాయని అనిపించినా సరే కెరీర్ లో ఆమె ఎంచుకున్న సినిమాల వల్ల అమ్మడి కెరీర్ నత్త నడక నడిచింది. కన్నడ సినిమా శంకర్ ఐపిఎస్ తో సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇచ్చిన కేథరిన్ తెలుగులో వరుణ్ సందేశ్ తో చమ్మక్ చల్లో సినిమాతో వచ్చింది. ఆ సినిమా పెద్దగా క్రేజ్ తీసుకు రాలేకపోయినా అల్లు అర్జున్ తో చేసిన ఇద్దరమ్మాయిలతో సినిమా ఆమెను యూత్ ఆడియన్స్ కు దగ్గరయ్యేలా చేసింది. అల్లు అర్జున్ తో 3 సినిమాల దాకా చేసిన అమ్మడు ఆ తర్వాత కూడా కెరీర్ ఆశించిన విధంగా కొనసాగించలేకపోయింది. కొన్ని సినిమాల్లో నిడివి



తక్కువ ఉన్న పాత్రల్లో నటించడం వల్ల ఆమె గ్రాఫ్ పడిపోయింది. ఎలాగోలా సినిమాల్లో కనిపించాలనే ఆలోచనతో కేథరిన్ ఆ సినిమాలు చేసిందేమో కానీ కెరీర్ కి ఆ పాత్రలు ఏవి ఉపయోగపడలేదని చెప్పొచ్చు. అయినా కూడా ఇప్పటికీ కేథరిన్ తెలుగులో అడపాదడపా అవకాశాలు అందుకుంటుంది. లాస్ట్ ఇయర్ కూడా భళా తందనానా, బింబిసార సినిమాల్లో నటించిన కేథరిన్ ఈ ఇయర్ వాల్తేరు వీరయ్య సినిమాలో రవితేజ భార్యగా నటించింది.

సినిమాలతో వచ్చే ఇమేజ్ కన్నా ఫోటో షూట్స్ తోనే ఎక్కువ క్రేజ్ తెచ్చుకోవాలని చూస్తున్నారు హీరోయిన్స్. వారిలో కేథరిన్ కూడా తన ఫోటో షూట్స్ తో ఆడియన్స్ ని అలరిస్తుంది. లేటెస్ట్ గా అమ్మడు తన గ్లామర్ షోతో కవ్విస్తుంది కేథరిన్. టాలెంట్ చూపిస్తూ అందాల విందు చేస్తున్న కేథరిన్ ఎలాంటి పాత్రలకైనా సిద్ధమే అనే హింట్ ఇస్తుంది. తెలుగులో తనకు ఐడెంటిటీ వచ్చినా అది నిలబెట్టుకోవడంలో తడబడింది కేథరిన్. ఫోటో షూట్స్ తో కాలం గడుపుతూ వచ్చిన చిన్నా చితకా ఆఫర్స్ చేస్తూ వస్తుంది అమ్మడు. మరి అమ్మడి కష్టాన్ని గుర్తించి ఎవరైనా అవకాశాలు ఇస్తారో లేదా అన్నది చూడాలి.




# పూజా పాప.. ఇది పర్ఫెక్ట్ గ్లామర్ బొమ్మ



కెరీర్ మొదట్లోనే ఊహించని విధంగా డిజాస్టర్ సినిమాలు ఎదుర్కొన్న పూజా హెగ్డే ఆ తర్వాత మెల్లగా తన గ్లామర్ తో వెండితెరపై క్రేజ్ అందుకునే ప్రయత్నం చేసింది. అల్లు అర్జున్ సినిమాల ద్వారానే ఆమె కెరీర్ ఒక విధంగా యూటర్న్ తీసుకుంది అని చెప్పవచ్చు. డీజే సినిమా తర్వాత అల వైకుంఠపురములో సినిమా ఆమెను మరొక రేంజ్ కు తీసుకు వెళ్ళింది. ఆ తర్వాత అగ్ర హీరోల నుంచి మరిన్ని ఎక్కువ అవకాశాలు వచ్చాయి. అయితే పూజ బ్యాడ్ లక్ ఏమిటో కానీ బన్నీతో సినిమా చేసిన తర్వాత ఏ సినిమా కూడా ఆమె అంతగా ఉపయోగపడలేదు. కంటెంట్ విభిన్నంగానే ఉంటున్నప్పటికీ కూడా బాక్సాఫీస్ వద్ద ఆమె చేస్తున్న క్యారెక్టర్స్ మాత్రం బోల్తా కొడుతున్నాయి. ఇక చివరికి చేతిలో ఉన్న సినిమాలు కూడా జారిపోయే పరిస్థితి ఏర్పడింది. దానికి తోడు పోటీగా మిగతా హీరోయిన్స్ కూడా ఉండడం వలన పూజా హెగ్డే రేంజ్ మెల్లమెల్లగా తగ్గుతుంది అనే విధంగా కామెంట్స్ కూడా వస్తున్నాయి. ఇక ఏది ఏమైనప్పటికీ కూడా ఈ బ్యూటీ సోషల్ మీడియా ప్రపంచంలో మాత్రం తన గ్లామర్ తో మరింత ఎక్కువ స్థాయిలో క్రేజ్ అందుకునే ప్రయత్నం అయితే చేస్తుంది. ఇక రీసెంట్ గా ఫ్యాషన్ ట్రావెల్ అనే ఒక మ్యాగజైన్ లో ఆమె ఇచ్చిన ఒక స్టిల్ చాలా బ్యూటిఫుల్ గా ఉంది. స్టైలిష్ డ్రెస్ లో అమ్మడు తన లెగ్స్ అందాలను మరింత హైలెట్ చేస్తూ కొంటె చూపుతో స్టిల్ ఇచ్చింది. గతంలో బికినీలో కూడా కనిపించిన పూజా హెగ్డే ఈ ఫోటోలో మాత్రం చాలా అందంగా ఉంది అంటూ ఆమె ఫాలోవర్స్ పాజిటివ్ గా కామెంట్స్ చేస్తున్నారు. ఇక పూజ హెగ్డే గుంటూరు కారం సినిమాలో మొదట అవకాశం అందుకున్నప్పటికీ ఆ తర్వాత ఎందుకో ఆ సినిమా నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఏడాది ఆమె బాలీవుడ్ లో సల్మాన్ ఖాన్ తో కిసి కా భాయ్ కిసి కి జాన్.. అనే సినిమా చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమా కూడా దారుణంగా డిజాస్టర్ అయ్యింది. ఇక ప్రస్తుతం ఆమె ఆశలు బాలీవుడ్ దేవా సినిమా పైనే ఉన్నాయి. ఈ సినిమాతో సక్సెస్ అందుకొని మరిన్ని అవకాశాలు పొందాలని చూస్తోంది.

# బీడీలతో సితార హీరోల మాస్ పొగలు!



వింటేజ్ హీరోలు రామారావు నుంచి స్టార్ హీరోల స్మోకింగ్ స్టైల్ సినిమాలకు ఒక రేంజ్ లో కలిసొస్తోంది. ఇక మాస్ అప్పీల్ రావాలి అంటే సిగరెట్ అనేది ఓ వర్గం హీరోలకు కామన్ స్టైల్ గా మారిపోయింది. తమ్ముడు సినిమాలో పవన్ కళ్యాణ్ , కూలి సినిమాలో వెంకీ కాస్త స్టైల్ మార్చి బీడీ వాడకంతో మరో కొత్త ట్రెండ్ షురూ చేశారు. ఇక మొన్నటి వాల్తేరు వీరయ్య లో కూడా మెగాస్టార్ అలాంటి ఉర మాస్ తో మెప్పించాడు. ఇక త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంపౌండ్ సైడ్ అయితే ఈ మధ్య బీడీ వాడకం ఎక్కువయ్యింది. మాస్ పొగలతో హీరోలు బిగ్ స్క్రీన్ పై మ్యాజిక్ క్రియేట్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇదివరకే త్రివిక్రమ్ అల.. వైకుంఠపురములో.. సినిమా కోసం అల్లు అర్జున్ చేత బీడీ పట్టించాడు. ఇక ఇప్పుడు గుంటూరు కారం సినిమా విషయానికి వచ్చేసరికి మహేష్ ను చేత బీడీ లేకుండా చూపించడం లేదు. పోస్టర్ అయినా సాంగ్ అయినా బీడీ ఉండాల్సిందే అనేలా హైలెట్ చేస్తున్నారు. మాస్ అప్పీల్ ఇంకా లోతుగా ఉండాలని స్టైలిష్ హీరోలను ఈ విధంగా బీడీ పొగలో చూపిస్తున్న విధానం కొత్తగానే ఉంది. ఇక సితార ప్రొడక్షన్ లోనే రూపొందుతున్న ఆదికేశవ సినిమాలో కూడా బీడీ హడావుడి ఉన్నట్లు తెలుస్తోంది. ఓ పోస్టర్ లో హీరో వైష్ణవ్ తేజ బీడీ కాలుస్తూ కనిపిస్తున్నాడు. ఈ సినిమా నిర్మాణంలో కూడా త్రివిక్రమ్ సొంత బ్యానర్ ఫార్చ్యూన్ ఫోర్ హ్యాండ్ ఉంది. ఓ విధంగా త్రివిక్రమ్ సైడ్ బీడీ పొగ తో మాస్ మ్యానియా ఎక్కువగా కనిపిస్తోంది. వైష్ణవ్ లాంటి కుర్ర హీరోకి ఈ బీడీ స్టిల్ బాగానే సెట్టయ్యింది. ఇక సినిమా కాంటెంట్ కు తగ్గట్టుగా బీడీ స్టిల్స్ వైరల్ అయితే రాబోయే రోజుల్లో బీడీ పొగ టాలీవుడ్ లో మరింత గుప్పుమనక తప్పదు. ఇక గుంటూరు కారం సినిమా సంక్రాంతికి రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు పొలిటికల్ మాస్ యాక్షన్ అంశాలు కూడా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే థమన్ నుంచి వచ్చిన ఒక సాంగ్ బాగానే క్లిక్ అయ్యింది. ఇక మరోవైపు వైష్ణవ్ తేజ్ నటించిన ఆదికేశవ్ వచ్చే వారం విడుదల కాబోతోంది.

# వేర్ ఈజ్ శ్రీ లీల.. మరీ ఇంత అన్యాయమా..?

టాలీవుడ్ లో ప్రస్తుతం బిజీ హీరోయిన్ గా వరుస సినిమాలు చేస్తున్న శ్రీలీల అక్టోబర్ నుంచి జనవరి వరకు నెలకో సినిమా రిలీజ్ పెట్టుకుంది. అమ్మడికి టైం అలా కలిసి వచ్చేస్తుంది అనుకోవచ్చు. దసరాకి భగవంత్ కేసరి అని వచ్చి సూపర్ హిట్ అందుకున్న శ్రీ లీల ఈ మంత్ ఎండ్ అంటే నవంబర్ 24న ఆదికేశవ్ సినిమాతో వస్తుంది. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా శ్రీకాంత్ ఎన్ రెడ్డి డైరెక్ట్ చేసిన ఈ సినిమా రిలీజ్ హంగామా మొదలైంది. అయితే సినిమా ప్రమోషన్స్ కు హీరోయిన్ శ్రీ లీల దూరంగా ఉంటుంది. రీసెంట్ గా ఆదికేశవ్ ఇంటర్వ్యూ కోసం అంతా సెట్ చేయగా శ్రీ లీల మిస్ అయ్యిందని టాక్. ఓ పక్క బిజీ షెడ్యూల్ తో ఉండటం మరోపక్క సినిమా ప్రమోషన్స్ కమిట్ అవ్వడం వీటి మధ్య శ్రీ లీల టైమింగ్స్ సెట్ అవ్వట్లేదని తెలుస్తుంది. అయితే అక్టోబర్ లో రిలీజైన భగవంత్ కేసరి సినిమాకు మాత్రం ఏ చిన్న ఇంటర్వ్యూ మిస్ అవకుండా చేసింది



శ్రీ లీల. ఆదికేశవ్ టైం కి వచ్చే సరికి ఆమె ప్రమోషన్స్ లో పాల్గొనలేకపోతుంది. ఆదికేశవ్ ప్రమోషన్స్ చేయాలనే టైం లో మహేష్ గుంటూరు కారం షూటింగ్ కోసం డేట్స్ అడ్జెస్ట్ చేసినట్టు తెలుస్తుంది. ఆదికేశవ్ టీం కి శ్రీ లీల అన్యాయం చేస్తుందని కొందరు అంటున్నారు. అయితే అది శ్రీ లీల ఇంటెషనల్ గా చేస్తుంది కాదు షెడ్యూల్ టైం అడ్జెస్ట్ చేయలేకనే ఆమె ఆదికేశవ్ ప్రమోషన్స్ లో కనిపించట్లేదని అంటున్నారు. మరి రిలీజ్ టైం దగ్గర పడుతున్న టైం లో శ్రీ లీల ఏదైనా టైం కేటాయిస్తుందేమో చూడాలి. సినిమాలో నటించిన నటీనటులు ఎంతమంది ఉన్నా హీరో హీరోయిన్ ప్రమోట్ చేస్తేనే అది ఆడియన్స్ కి రీచ్ అవుతుంది. ప్రస్తుతం సూపర్ ఫాం లో ఉన్న హీరోయిన్ శ్రీ లీల ప్రమోషన్స్ చేస్తే యూత్ ఆడియన్స్ లో మంచి బజ్ ఏర్పడే ఛాన్స్ ఉంటుంది. మరి రిలీజ్ కు ముందైనా శ్రీ లీల ఆదికేశవ్ కి సపోర్ట్ చేస్తుందా లేదా అన్నది చూడాలి. ఆదికేశవ్ తర్వాత సరిగ్గా 20 రోజుల్లోపే నితిన్ తో ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ అంటూ మరో సినిమాతో వస్తుంది శ్రీ లీల. ఇక సంక్రాంతికి గుంటూరు కారం తో అదరగొట్టేందుకు కూడా రెడీ అవుతుంది. ఏది ఏమైనా శ్రీ లీల ఫాం చూసి మిగతా హీరోయిన్స్ అంతా షాక్ అవుతున్నారనే చెప్పొచ్చు.

## నడుము అందంతో కవ్విస్తున్న నువేక్ష

ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా సోషల్ మీడియా ముద్దుగుమ్మలు అందాల ఆరబోత చేస్తూ నెటిజన్స్ కి కన్నుల విందు చేస్తున్నారు. ప్రస్తుతం నెట్టింట ఎంతో మంది ముద్దుగుమ్మలు అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. తాజాగా నువేక్ష సోషల్ మీడియా సెన్సేషన్ గా మారింది. సినిమాల్లో పెద్దగా అలరించకున్నా కూడా ఎక్కువ శాతం హాట్ ఫోటో షూట్స్ తో ఈ అమ్మడు అలరిస్తూ ఉంది. తాజాగా మరోసారి ఇలా నడుము అందాలను చూపిస్తూ వావ్ అనిపించింది. ఈ రేంజ్ అందాల ఆరబోత చేస్తే ముందు ముందు ఈ అమ్మడు సౌత్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు అంటున్నారు. సోషల్ మీడియా



ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న వారు ఈ మధ్య కాలంలో ఎక్కువగా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. కనుక నువేక్ష కూడా త్వరలోనే హీరోయిన్ గా బిజీ అవ్వబోతుందని ఈ ఫోటోలను చూస్తుంటే అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ తో పాటు మీడియా వర్గాల వారు కూడా మాట్లాడుకుంటున్నారు. వైట్ టాప్ లో గోదుమ రంగు స్కర్ట్ తో నడుము అందాలను సైడ్ యాంగిల్ ద్వారా చూపడం ద్వారా నువేక్ష కన్నుల విందు చేస్తుంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి ఈ ఫోటోలతో చెప్పకనే చెప్పింది. ఫ్యాషన్ రంగంలో దూసుకు పోతున్న ఈ అమ్మడు ముందు ముందు వెండి తెరపై తనదైన ముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.




## ఆరు గ్యారంటీలతో పాటు 36 అంశాలు.. కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

హైదరాబాద్: తెలంగాణ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో విడుదల చేసింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మేనిఫెస్టోను విడుదల చేశారు. ముందుగా ప్రకటించిన ఆరు గ్యారంటీలతోపాటు 36 అంశాలను అందులో చేర్చారు. అమరవీరుల కుటుంబాలకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు గౌరవభృతి అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. వీటితో పాటు వివిధ ఇతర అంశాలపై కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే తదితరులు పాల్గొన్నారు.

**ఆరు గ్యారంటీలివే..** మహాలక్ష్మి: మహిళలకు ప్రతి నెల రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం. రైతు భరోసా ప్రతి ఏటా: రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, వరిపంటకు క్వింటాలుకు రూ.500 బోనస్. గృహజ్యోతి: ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్. ఇందిరమ్మ ఇళు..: ఇల్లులేని వారికి ఇంటి స్థలం–రూ.5లక్షలు, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం. యువ వికాసం: విద్యార్థులకు రూ.5లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్. చేయూత: రూ.4వేల నెలవారీ పింఛను, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్య శ్రీ బీమా

## అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 6 గ్యారంటీల అమలు: ఖర్గే



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఇప్పటికే ఓటర్లు నిర్ణయించుకున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టోను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను అక్షరాలా అమలు చేస్తామన్నారు. "కర్ణాటకలో హామీ ఇచ్చిన విధంగా 5 గ్యారంటీలను అమలు చేసి చూపిస్తున్నాం. తెలంగాణలోనూ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు అమలు చేసి చూపిస్తాం. తొలి మంత్రివర్గ సమావేశంలోనే వాటిని ఆమోదిస్తాం. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేసి చూపిస్తాం. భాజపా నేతలు భారాసపై విమర్శలు తగ్గించేశారు. సీఎం కేసీఆర్, ప్రధాని మోదీ పరస్పర విమర్శలు మానేశారు. కేసీఆర్‌కు పదవీ విరమణ సమయం వచ్చేసింది. ఓటమి తప్పదని ఆయనకు అర్థమైపోయింది"అని ఖర్గే అన్నారు.

## కాంగ్రెస్‌తో జాగ్రత్తగా ఉండకపోతే.. వైకుంఠం ఆటల పెద్ద పాము మింగినట్టే ఉంటది



కరీంనగర్: కాంగ్రెస్ పార్టీతో జాగ్రత్తగా ఉండకపోతే.. వైకుంఠం ఆటల పెద్ద పాము మింగినట్టే ఉంటదని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. శుక్రవారం నాడు చొప్పదండిలో సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ మాటలు చాలా డేంజర్‌గా ఉన్నాయి. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అంటున్నారు. 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలని అంటున్నారు. ఈ మోటార్లు నీ అయ్య ఇస్తాడా..? 24 గంటల కరెంట్ కావాలా.. మూడు గంటల కరెంట్ కావాలా రైతులు ఆలోచించాలి. రైతు బంధు వద్దని ఇంకో కాంగ్రెస్ నేత చెప్తున్నాడు. ధరణి తీసేస్తామని అంటున్నారు..ఇది పెద్ద డేంజర్. కాంగ్రెస్ పార్టీ భూ భారతి అని కొత్తది తెస్తారట. కర్ణాటకలో బాగా మాట్లాడినరు.. కర్ణాటక సన్నాసులకు తెల్వదు.. మనం 24 గంటలు కరెంట్ ఇస్తున్నాం" అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

**బుద్ధున్నోడు అలా మాట్లాడుతాడా?.. బండి సంజయ్‌పై కేసీఆర్ పరోక్ష విమర్శలు :** బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ పరోక్ష విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం మాట్లాడుతూ.. కేబుల్ బ్రిడ్జి మీద డాంబర్ కారితే కూలగొట్టాలని మాట్లాడుతారా అంటూ మండిపడ్డారు. "కేబుల్ మీద చిన్న గీత పడితే కూలిపోతదా. కొందరు సన్నాసులు మాట్లాడుతున్నారు.. తలకాయ, బుద్ధి ఉందా ఆ వెధవకు.. తోక మీద ఈకలు పీకుతున్నారు. బుద్ధి ఉన్నోడు అలా మాట్లాడుతారా. వాడు వీడు ఏదో మాట్లాడితే పట్టించుకోవద్దు. కరీంనగర్ ప్రజలు ఐదేళ్లుగా బాధ పడుతున్నారు. మత పిచ్చి తప్ప ఇక్కడి బీజేపీ నేతకు ఇంకేం రాదు. మసీదులు తవ్వినోడు సిపాయా. గుడులు, మసీదులు తవ్వడం మంచిదా. బీజేపీకి మత పిచ్చి తప్ప ఇంకేం రాదు. మోదీ మా తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ ఇచ్చినవా. మాకు మేమే కాలేజీలు కట్టుకుంటున్నాం" అని కేసీఆర్ వ్యాఖ్యలు చేశారు.




ఖానాపూర్: మంచిగా నడిచే ప్రభుత్వాన్ని.. ప్రగతిలో దూసుకెళ్తోన్న రాష్ట్రాన్ని ఎవరు పడితే వారి చేతుల్లో పెడదామా?ప్రజలు ఆలోచించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకవైపు కాంగ్రెస్.. మరోవైపు భాజపా నేతలు దిల్లీ నుంచి రాష్ట్రానికి వస్తున్నారని.. వారందరి అజెండా ఒక్కటేనన్నారు. ఎలాగైనా కేసీఆర్ గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎంత మంది వచ్చినా సరే.. భారాస మాత్రం రాష్ట్ర ప్రజల మీదే భారం వేసి ముందుకెళ్తోందన్నారు. మంచిర్యాల జిల్లా ఖానాపూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన కేటీఆర్.. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలో 46 లక్షల మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు వస్తున్నాయి. కాంగ్రెస్ హయాంలో కేవలం 29 లక్షల మందికి మాత్రమే పింఛన్లు వచ్చేవి. బీడీలు చేసే అక్కా చెల్లెళ్లను గతంలో ఏ ముఖ్యమంత్రి పట్టించుకోలేదు. కేసీఆర్ సీఎం అయ్యాకనే కదా.. రూ. 2వేలు పింఛన్ ఇస్తున్నారు. తెలంగాణ సాధించుకున్నాం కాబట్టే.. మన డబ్బులు మనం తీసుకుంటున్నాం. రైతు బీమా, రైతు బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటున్నాం. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు మేనమామలా.. కేసీఆర్ అండగా ఉన్నారు. కాంగ్రెస్ హయాంలో సర్కారు దవాఖానాకు వెళ్లను బాబోయ్ అని అనేవారు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. వెళ్తే.. ప్రభుత్వ ఆస్పత్రికే వెళ్తామని ప్రజలు అంటున్నారు. తాగు నీరు, సాగు నీరు, కరెంటు, సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ బ్రహ్మాండంగా అభివృద్ధి బాటలో ముందుకెళ్తున్నాం.

నీరు, కరెంటుతో పాటు అనేక సమస్యలు పరిష్కరించిన భారాస.. మాకేం చేస్తుందని తెలంగాణ ఆడబిడ్డలు అడుగుతున్నారు. అత్తలకు పింఛన్లు వస్తున్నాయి.. మరి మా సంగతి ఏంటని కోడళ్లు ప్రశ్నిస్తున్నారు. అందుకే డిసెంబర్ 3 తర్వాత కోడళ్లకు కేసీఆర్ శుభవార్త చెబుతారు. 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలందరి కోసం కొత్త పథకాన్ని అమలు చేస్తాం. దాని పేరు 'సౌభాగ్య లక్ష్మి'. నెలకు రూ.3వేలు మీ ఖాతాల్లో వేస్తాం. ఖానాపూర్‌లో మీరు వేసే ఓటు జాన్సన్‌కు కాదు.. కేసీఆర్‌కు వేస్తున్నట్లే భావించాలి" అని కేటీఆర్ కోరారు.

## బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ చెప్పే బూటకపు మాటలను నమ్మి మోసపోవద్దు

హైదరాబాద్: బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చెప్పే బూటకపు మాటలను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర బీఎస్పీ పార్టీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యానించారు. శుక్రవారం నాడు జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా బహుజన రాజ్యాధికార బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థితో కలిసి ప్రవీణ్ కుమార్ బహిరంగ సభ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. సభలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. "అలంపూరు గడ్డలో పుట్టినా..నడిగడ్డలో మొలికెత్తిన విత్తనాలు తిని ఈ స్థాయికి ఎదిగాను. ఆంధ్ర పాలకుల దోపిడి వల్ల నష్టపోయిన సిర్పూర్ కాగజ్‌నగర్ గడ్డమీద పోటీ చేస్తున్నాను. అలంపూరు, సిర్పూర్ రెండు నియోజకవర్గాలు బహుజన్ సమాజ్ పార్టీకి రెండు కళ్ల లాంటివి. 2009లో కొంతమంది దుర్మార్గుల వల్ల వెయ్యి ఓట్లతో ప్రస్తుత అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్ ఓడిపోయారు. తుమ్మిళ్ల దగ్గర కావలి కుక్కలా రైతులకు సాగునీరు ఇస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే మాట ఇచ్చారు.. గుంటనక్కల మారి ప్రజల జీవితాల్లో మన్ను పోశాడు. జూలకల్లు, మల్లమ్మ కుంట రిజర్వాయర్ల సంగతి అధ్వానంగా ఉన్న కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ పనులకు మరమ్మతులు లేవు.. చేసిన మరమ్మతుల్లో కూడా భారీ కుంభకోణం చేసిన ఘనత మీది. తెలంగాణ ప్రభుత్వం కుళ్లు కుతంత్రాలతో నిండి ఉంది. తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం పదేళ్ల నుంచి రాజ్యమేలుతుంది. పదేళ్లుగా తెలంగాణ దోపిడికి గురైంది. వాళ్ల ఫామ్ హౌస్‌లో డబ్బులు దాచుకున్నారు. రైతులు పంట ఏ విధంగా మార్పిడి చేస్తారో.. ఈ రోజు కల్వకుంట్ల కుటుంబాన్ని ఈ ఎన్నికల్లో మార్చాలి. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి హెలికాప్టర్‌లో తిరుగుతూ... భూములను ఎలా దండుకోవాలి.. ఫామ్ హౌస్‌లు ఎలా నిర్మించుకోవాలో అని భూములను పరిశీలిస్తున్నారు. మేము హెలికాప్టర్లో తిరుగుతుంటే.. ప్రభుత్వ భూములను, భూస్వాముల దగ్గర గల భూములను పేదలకు ఎలా పంచాలో చూసేందుకు హెలికాప్టర్ నుంచి సర్వే చేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాదిగలకు నవంబర్ 11వ తేదీన క్షమాపణ చెప్తున్నానని అన్నారు. ఎన్నికల ముందు రిజర్వేషన్ ఇస్తా అంటున్నావు. పదేళ్లుగా మోదీ అధికారంలో ఉండి మాదిగలకు ఏం చేశారు" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# డబ్బుకు ప్రాధాన్యం ఇవ్వకుండా, ప్రజా సేవ చేసే వారికి అవకాశం ఇస్తే ప్రజాస్వామ్యం పైరవిల్లుతుంది - ఈటెల రాజేందర్





గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : డబ్బులతో ఓట్లు కొనగలుగుతా అనుకుంటున్నా వారి ఆట కట్టించి, ప్రజాసేవ చేసే వారికి అవకాశం ఇస్తే దేశంలో ప్రజాస్వామ్యం పైరవీలుతుందని బిజెపి స్టార్ క్యాంపెనర్ ఇటల రాజేందర్ అన్నారు. శుక్రవారం శామీర్ పేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ తరపున పోటీ చేస్తున్న మేడ్చల్ అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారానికి హాజరైన ఈటెల రాజేందర్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ నిత్యం ఈ దారిలోనే తన ఫామ్ హౌస్ కు వెళ్లి వస్తూ ఉంటాడు కానీ, ఒక్కసారైనా శామీర్ పేటలో ఆగాడా శామీర్ పేట ప్రజల్ని కలిశాడా కనీసం వాళ్ళ సమస్యలను తెలుసుకోవడానికి ప్రయత్నించాడా ప్రజలను కలవరి ముఖ్యమంత్రి కేసీఆర్ అని అలాంటి ముఖ్యమంత్రిని ఇంట్లో కూర్చోబెట్టాల్సిన సమయం ఆసన్నమైందని ఈటల అన్నారు. మల్లారెడ్డి కి ఓటు వేస్తే కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు సుదర్శన్ రెడ్డికి ఓటు వేస్తే మీకు అందుబాటులో ఉంటాడని అన్నారు. సుదర్శన్ రెడ్డికి ఓటు వేయడం అంటే ధర్మానికి ఓటు వేయడమే అహంకారాన్ని అనీచి వేయడమేనని నొక్కి ఒక్కాణించారు. బొమ్మరాశిపేటలోని భూములు అన్ని గుంజుకొని పెద్దలకు కేసీఆర్ కట్టబెడుతున్నారని ఆరోపించారు. తాను గజ్వేల్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నానని పిలవగానే కేసీఆర్ కామారెడ్డికి పారిపోయాడని ఎద్దేవా చేశారు. గజ్వేల్ లో గెలిచేది ధర్మమేనని అన్నారు. నరేంద్ర మోడీ గారి అండతో ప్రజలకు హామీ ఇస్తున్నానని అందులో భాగంగా ప్రతి పేదవాడికి ఇంగ్లీష్ మీడియం విద్యను ఉచితంగా అందిస్తామన్నారు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తామన్నారు. నిరుద్యోగ బిడ్డలకు ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తామని, ఇద్దరు ముసలి వాళ్లకు పెన్షన్ అందిస్తామని తెలిపారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు అర్హులందరికీ ఇస్తామని హామీ ఇచ్చారు ఆకలి తెలిసిన వాళ్ళం అధికారంలోకి వస్తే మీ బాధలన్నీ తప్పక తీరుస్తామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. ఇక మేడ్చల్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ...మల్లారెడ్డి స్థానికుడు కాదు కబ్జా కోరుడని కోట్లు పెట్టి టికెట్ కొనుక్కుంటారని ఆరోపించారు. మళ్లీ సంపాదించుకునేందుకు ప్రజలపైనే పెడతాడని ఆరోపించారు ఒక జూనియర్ డిగ్రీ కాలేజీ కూడా మేడ్చల్ నియోజకవర్గం లో తేలేకపోయిన మంత్రిని ఎలా మళ్ళీ ఒకసారి గెలిపిస్తారో ఒక్కసారి ప్రజలు ఆలోచించాలని ఆయన కోరారు. తాను సమస్యల కోసం పోరాడానని కరోనా సమయంలో ఎంతోమందికి తాను అండగా నిలిచాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ ఎంపీ సురేష్ రెడ్డి, రాష్ట్ర నాయకులు బుద్ధి శ్రీనివాస్, పట్నం నర్సింహ రెడ్డి, కైరా యాదగిరి, జగన్ గౌడ్, రాజు గౌడ్, పవన్ గౌడ్ , మేడ్చల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, ఎస్టీ మోర్చా నాయకులు సుధాకర్ నాయక్, అంకుషా పూర్ సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చందర్ రెడ్డి, సరయు, బీజేవైఎం సంపత్, మామిళ్ల అశోక్, మాజీ ఎంపీపీ హృదయ కుమార్, మంచినీళ్ల లక్ష్మణ్, అల్లం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూం ఇళ్లపై తుమ్మల సంచలన వ్యాఖ్యలు



ఖమ్మం: కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. శుక్రవారం టేకులపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల కాలనీ కేసీఆర్ టవర్స్ వద్ద తుమ్మల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

కురిసే ఇళ్ళు కట్టినందుకు బీఆర్ఎస్‌కు ఓట్లు వేయాలా అని మండిపడ్డారు. పోలీసులతో బెదిరించినందుకు ఓట్లు వేయాలా అని నిలదీశారు. రాజకీయాలు మర్యాదగా, గౌరవంగా చేయాలని సూచించారు. చేసిన అభివృద్ధి పనులు చెప్పి ఓట్లు అడగాలి కానీ అరాచకంతో కాదని హితవుపలికారు. అభివృద్ధి పనులు చేసినోళ్లకు ప్రజలు పూలు వేస్తారన్నారు. బెదిరించి ఓట్లు అడిగితే చెప్పులతో మహిళలు కొడతారని హెచ్చరించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ళు కమీషన్ల కోసం నాసిరకంగా కట్టారని విమర్శించారు. పోలీసుల బెదిరింపులు లేని, అవినీతి భూ కబ్జాలు లేని ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

## గ్యారంటీలకు గాంధీలు, క్షమాపణలకు బంట్రోతులా?



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "గ్యారంటీలకు గాంధీలు, క్షమాపణలకు బంట్రోతులా ???!! ఆరు దశాబ్దాల పాటు తెలంగాణను మోసం చేసిన గాంధీలు కనీసం స్వయంగా క్షమాపణ చెప్పలేరా? పదేండ్లలో ఒక్కసారి కూడా మీ కుటుంబానికి వందలాది తల్లుల కడుపు కోత గుర్తు రాకపోవడం బాధాకరం! ఈ గడ్డమీద జోడోయాత్రలు చేసి ఒక్కసారి కూడా జై తెలంగాణ చెప్పకపోవడం దారుణం. ఈ రోజుకీ మీకు అమరవీరుల స్థూపానికి దారి తెలియకపోవడం అత్యంత బాధాకరం. సోనియా, రాహుల్ గాంధీలు అమరవీరుల స్థూపం ముందు మేకరిల్లినా మీ పాపాలకు ప్రాయుశ్చిత్తం ఉండదు!" అంటూ కవిత వ్యాఖ్యలు చేశారు.

## తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలేదు.. ప్రజలే మెడలు వంచి సాధించుకున్నారు: కిషన్‌రెడ్డి




హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ అన్ని విధాలుగా అన్యాయం చేసిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

నాంపల్లిలో భాజపా అభ్యర్థి రాహుల్‌చంద్రకు మద్దతుగా ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో భాజపాను గెలిపించాలని ప్రజలను ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలేదని.. ప్రజలే ఆ పార్టీ మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని చెప్పారు. అనేక మంది ఉద్యమకారుల ఆత్మబలిదానాలతో తెలంగాణ ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు.

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికల నామినేషన్‌పై హైకోర్టులో పిటిషన్






హైదరాబాద్: మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికల నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాఘువేంద్ర రాజు అనే వ్యక్తి శుక్రవారం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల మంత్రి శ్రీనివాస్ గౌడ్ వేసిన నామినేషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేసినా ఎన్నికల రీటర్నింగ్ అధికారి పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. శ్రీనివాస్ గౌడ్ వేసిన అఫిడవిట్, నామినేషన్‌లో వాస్తవాలు తొక్కిపెట్టారని పిటిషన్‌లో తెలిపారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికలను రద్దు చేయాలని కోరుతూ రాఘవేంద్రరాజు పిటిషన్ వేశారు. అలాగే మంత్రి శ్రీనివాసగౌడ్ భార్య వృత్తికి సంబంధించిన వివరాలు వెల్లడించలేదని పిటిషన్‌లో తెలిపారు. పిటిషన్‌పై విచారించిన హైకోర్టు.. పిటిషనర్ అభ్యంతరాలను చూడాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ రాఘవేంద్ర రాజుకు పూర్తి లీబర్టీ ఇచ్చిన హైకోర్టు.. పిటిషన్‌ను ముగించేసింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com